website:www.netinijam.com

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 27-2-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 182 పేజీలు: 8 వెల: రూ.1/-

### వేములవాడలో దారుణం

# ఓటు వేయలేదని వ్యక్తి హత్య

రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి26(నేటినిజం ప్రతినిది): వేములవాడలో రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. ఓటు వేయలేదన్న కక్షతో ఓ యువకుడిని హత్య చేశారు. ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో తనకు ఓటు వేయలేదనే కోపంతో ముద్రకోల వెంకటేశ్ అనే మాజీ కౌన్సిలర్ శివ అనే యువకుడిపై కత్తితో దాడిచేశాడు. తీవ్రగాయాలపాలైన బాధితున్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వేములవాడ మున్సిపాలిటీలోని 3వ వార్డు నుంచి వెంకటేశ్ టీఆర్ఎస్ తరపున పోటీచేశాడు. ఇండిపెండెంట్ అభ్యర్థి దివ్య చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యాడు. అయితే, తన ఓటమి కారణం శివే అని వెంకటేశ్ కక్ష పెంచుకున్నాడు. తనకు కాకుండా ప్రత్యర్థి దివ్యకు ఓటు వేసిన శివను చంపుతానంటూ పలుమార్లు హెచ్చరించాడు. ఈ క్రమంలోనే పక్కా ప్లాన్‌తో అతనిపై కత్తితో దాడికి దిగాడు. నిందితుడు వెంకటేశ్, అతని మిత్రుడిని పోలీసులు అరెస్టు చేశారు.

# ఢిల్లీ ఘటనలపై సుప్రీం సీరియస్

### పోలీసుల తీరును తప్పుపట్టిన ఉన్నతన్యాయస్థానం
### విచారణ 23కు వాయిదా
### 1984 ఘటనలు పునరావృతం కానివ్వమన్న ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): షాహిన్‌బాగ్, ఈశాన్య ఢిల్లీ ఘటనలపై సుప్రీంకోర్టు విచారణను వచ్చే నెల 23కు వాయిదా వేసింది. ఢిల్లీ హైకోర్టులో కేసు ఉన్నందున పిటిషన్‌పై విచారణకు నిరాకరించిన సుప్రీం.. హైకోర్టు విచారణను ముందుకు సాగనివ్వాలని పిటిషనర్లకు సూచించింది. ఆందోళనల్లో 20 మంది మృతి చెందడం దురదృష్టకరమన్న సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసుల తీరును తప్పుపట్టింది. ఢిల్లీ పోలీసులు సమర్థవంతంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. దేశరాజధాని ఢిల్లీలో సీఏఏ అల్లర్లపై న్యాయస్దానం బుధవారం తీవ్రంగా స్పందించింది. షహీన్‌బాగ్ నిరసనలపై పిటిషన్లు విచారించేందుకు ప్రస్తుతం అనుకూల వాతావరణం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. నిరసనకారులతో సుప్రీంకు చెందిన ఇద్దరు మధ్యవర్తులు ఇటీవల చర్చలు చేపట్టారు. వారు ఇచ్చిన నివేదికను సుప్రీంకు సమర్పించారు. షహీన్‌బాగ్ నిరసనల గురించి చర్చించాల ంటే.. వాతావరణం నిర్మలంగా ఉండాలని జస్టిస్ ఎస్‌కే కౌల్, కేఎం జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. ముందుగా ప్రశాంతత ఏర్పడాలని, ప్రస్తుతం ఎన్నో పెద్ద అంశాలను పరిశీలనకు ఉన్నాయని, రెండు వర్గాలు బాధ్యతతో వ్యవహరిం చాలని జస్టిస్ కౌల్ అన్నారు. ఢిల్లీలో జరిగిన అల్లర్ల గురించి కూడా ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. పోలీసుల్లో ప్రొఫెషనలిజం కొరువడిందని జస్టిస్ కౌల్ అన్నారు. చట్టంప్రకారం పోలీసులు వ్యవహరిస్తే, ఇలాంటి ఎన్నో సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడే, పోలీసులు ముందుకు వస్తున్నారని, లేదంటే వాళ్లలో చలనం లేకుండా పోయిందన్నారు. ఢిల్లీ అల్లర్లపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని, దాని గురించి ఈ సమయంలో మేమేమీ చెప్పలేమ న్నారు. ప్రజలు వినియోగించే రహదారులను.. నిరంతరం నిరసనలకు వాడకూడదన్నారు. పోలీసులు, అధికారులు ఓ వ్యవస్థ ప్రకారం పనిచేయాలన్నారు. అడ్వకేట్లు సాధనా రామచంద్రన్, సంజయ్ హెగ్డేలు మధ్యవర్తులుగా వెళ్లి షహీన్‌బాగ్ నిరసనకారులతో చర్చించారు. ఇదిలావుంటే దేశంలో మరో 1984 ఘటనలను పునరావృతం కానివ్వబోమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈశాన్య ఢిల్లీలో ఐబీ అధికారి మృతదేహం లభ్యం కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇది దురదృష్టకర ఘటన అని అభివర్ణించిన కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు తక్షణమే బాధితులు, బాధిత కుటుంబాలను కలుసుకోవాలని ఆదేశించింది. బాధితులకు సాయం అందించేందుకు హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలని, బాధితులను ఆస్పత్రులు, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రైవేట్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని అధికారలను ఆదేశించింది. బాధితుల కోసం కనీస సదుపాయాలతో కూడిన పునరావాస షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరింది. అల్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల్లో విశ్వాసం నెలకొల్పేందుకు ఢిల్లీ సీఎం, డిప్యూటీ సీఎంలు ఆయా ప్రాంతాల్లో పర్యటించాలని కోర్టు ఆదేశించింది. కాగా ఢిల్లీ అల్లర్లలో ఇప్పటివరకూ 17 మంది మరణించారని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది.

### శాంతి, సామరస్యమే భారతీయ విలువలు

# ప్రజలు సోదరభావం పాటించాలి - ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ఆందోళనల నేపథ్యంలో ప్రధాని మోడీ బుధవారం విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో శాంతి నెలకొల్పేందుకు భద్రతాబలగాలు ఎంతో శ్రమిస్తున్నాయన్నారు. శాంతి, సామరస్యాలే భారతీయ విలువలని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఢిల్లీ ప్రజలంతా శాంతి, సోదరభావాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధ్వంసకారులపై కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులను ప్రధాని ఆదేశించినట్లు తెలిసింది. అల్లర్లకు కారకులైన వారిని ఉపేక్షించేది లేదని సమావేశంలో మోడీ స్పష్టంచేశారు. అల్లర్లు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు బలగాలను సిద్ధం చేసుకోవాలని భద్రతాధికారులకు సూచించారు. ఆందోళనలు, విధ్వంసాలతో భారత ఔన్నత్యాన్ని దిగజార్చాలని చూసే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టంచేశారు. రాష్ట్రాలను కూడా అప్రమత్తంచేయాలని మోడీ సూచించారు. సీఏఏ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య గత రెండు రోజులుగా ఈశాన్య ఢిల్లీలో ఘర్షణ వాతావరణం తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ కేంద్ర మంత్రి మండలితో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రతా విభాగాల అధికారులు, మంత్రులు, కేబినెట్ కార్యదర్శి,తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదం అణచివేతకు ఎలాంటి చర్యలకైనా సిద్ధమే

### సరిహద్దులు దాటయినా దాడులు చేస్తాం
### వైమానికి దాడులకు ఏడాదయిన సందర్భంగా రాజ్‌నాథ్ ట్వీట్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): ఉగ్రవాదం నుంచి దేశానికి కాపాడుకునేందుకు అవసరమైతే సరిహద్దులు దాటి వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. బాలాకోట్ ఉగ్రవాద శిబిరంపై భారత వైమానిక దళం మెరుపు దాడులు నిర్వహించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయన ట్విటర్ వేదికగా స్పందించారు. బాలాకోట్ వైమానిక దాడులు జరిగి సంవత్సరం పూర్తయి సందర్భంగా దేశం యావత్తూ సంబరాలు చేసుకుంటోంది. శౌర్యవంతులైన ఐఏఎఫ్ వీరులు చేపట్టిన అత్యంత విజయవంతమైన ఆపరేషన్ ఇది. బాలాకోట్ ఆపరేషన్‌లో విజయం సాధించడం ద్వారా తీవ్రవాదులకు భారత్ గట్టి సందేశాన్ని ఇచ్చిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. బాలాకోట్ వైమానిక దాడుల కోసం అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించారంటూ ఆయన కొనియాడారు. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు నరేంద్రమోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం గత ప్రభుత్వాలకంటే భిన్నమైన విధానాన్ని ఎంచుకున్నదని ఆయన పేర్కొన్నారు. ఇక ఇప్పుడు ఉగ్రవాదం నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు అవసరమైతే సరిహద్దులు దాటేందుకు కూడా భారత్ వెనుకాడబోదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో సరికొత్త మార్పు తీసుకొచ్చిన నరేంద్ర మోదీకి రక్షణమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదం పట్ల భారత వైఖరిని, పోరాట పంథాని సమూలంగా మార్చిన ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు. 2016 సర్జికల్ దాడులు, 2019 బాలాకోట్ వైమానిక దాడులు ఈ మార్పునకు స్పష్టమైన సంకేతాలని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

# సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నేటినిజం ప్రతినిధి): ఢిల్లీలోని కామని ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 24 మంది రచయితలకు సాహిత్య అకాడమీ అవార్డులను ప్రదానం చేశారు.అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబర్, ప్రముఖ పాటల రచయిత, సినీ నిర్మాత గుల్జార్ కలిసి అవార్డు గ్రహితలకు పురస్కారాలను అందజేశారు. బండి నారాయణ స్వామి (శప్తభూమి), కాంగ్రెస్ సీనియర్ నేత, ఆంగ్ల రచయిత శశి థరూర్, ప్రముఖ హిందీ కవి నందకిషోర్ తదితరులు అవార్డులు స్వీకరించారు.



అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బండి నారాయణస్వామి.

## చరిత్రలో నేటినిజం



కం॥ మూయుని మమకారవుడూ
నాయకుడై మంచి పాలనమునందింపన్
'బీ.యస్.ఎడ్యూరప్ప'కు
శ్రేయమ్ము నొసంగు భవుడు క్షేమంకరుడై!!

(ఫిబ్రవరి 27 బీ.యస్. ఎడ్యూరప్ప జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# దంపతుల ఆత్మహత్య..భార్య మృతి

హైదరాబాద్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): వనస్థలిపురం హరిహరపురం కాలనీలో విషాదం నెలకొంది. కాలనీలోని ఓ ఇంట్లో ఇద్దరు దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. భార్య మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. భర్తను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దంపతుల ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సంస్కృతి. కళలను భావితరాలకు అందించాలి - గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



అమెరికాలో ఉంటూ భారతీయ సంస్కృతి, కళలను విస్తృతం చేస్తున్న నాట్య కళాకారిణి సుజాతావింజమూరి అభినందనీయులని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రవీంద్రభారతిలో రాగసప్తస్వరం ఆధ్వర్యంలో నిర్వహించిన సప్తగిరి వైభవం, శ్రీ వేంకటేశ్వర తత్త్వం ప్రవచన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సంస్కృతి, కల్చర్‌ను అందించాలన్నారు. రాజులకాలంలో కళలకు ఆదరణ ఉండేదని, నృత్య రూపకం చూస్తుంటే తిరుమలలో ఉన్న అనుభవం కలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥ కే.వీ. రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥కె. లక్ష్మణ్, తెలుగుదేశం మహిళా నాయకురాలు నన్నపనేని రాజకుమారి అతిథులుగా పాల్గొని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుందరవల్లి రచించిన 'గిరివైభవం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గరికపాటి నరసింహారావు వేంకటేశ్వర తత్త్వాన్ని అర్థమయ్యేలా ప్రవచించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం గవర్నర్ కళాకారులతో పాటు అవధాని గరికపాటి నరసింహారావును ఘనంగా సత్కరించారు.

# కరోనాతో భద్రం అంటున్న అమెరికా

### ఆర్థిక వ్యవస్థనూ దెబ్బతీస్తోన్న వైరస్

వాషింగ్టన్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్-19 ప్రబలుతున్న నేపథ్యంలో అమెరికా తన దేశ పౌరులకు తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ఈ వైరస్ ప్రబలినందున అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలని అమెరికా వైద్యశాఖ హెచ్చరించింది. చైనాలోని వూహాన్ నగరంలో ఉద్భవించిన కొవిడ్-19 ప్రపంచంలోని 30 దేశాలకు వ్యాపించింది. ఆస్ట్రియాలోని ఆల్పైన్ టూరిస్ట్ హబ్‌లోని అల్పైన్స్ టూరిస్టు హబ్‌లో ఇటాలియన్ రిసెప్షనిస్టుకుకు కొవిడ్ -19 పాజిటివ్ అని తేలింది.దీంతో 108 గదుల గ్రాండ్ హోటల్ యూరప్ ను మూసివేశారు. కొవిడ్ ప్రబలిందని యూరోపియన్ హోటల్‌ను మూసివేశారు. ఈ వైరస్ వ్యాప్తిలో ఇటలీ దేశం ముందుంది. ఇటలీలో 280 మందికి కొవిడ్ సోకగా వారిలో పదిమంది మరణించారు. చైనా దేశంలోని హాంగ్ కాంగ్ నగరంలో వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పాఠశాలలను మరో మూడు వారాల పాటు మూసివేశారు. ప్రపంచీకరణ యుగంలో కరోనా వైరస్ (కొవిడ్ -19) వ్యాప్తి మహమ్మారిగా మారగలదనే ఆందోళన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై సందేహాలను రేకిత్తిస్తోంది. ఇప్పటివరకూ కరోనా వ్యాప్తితో మరణాల సంఖ్య 3,000కి చేరుకుంది. 80వేలకు పైగా కేసులు అధికారికంగా నమోదయ్యాయి. ఇటలీలో కరోనా వ్యాప్తి చెందడం ఇప్పుడు దాని ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తోంది. ప్రపంచ వృద్ధికి కరోనా వ్యాప్తి అసలు కారణం ఏంటో అర్థం చేసుకోవడానికి కొందరు ఆర్థికవేత్తలు వార్ గేమ్ ప్రారంభించారు. మరోవైపు గ్లోబల్ జిడిపి నుండి 1 ట్రిలియన్ డాలర్లకు పైగా తుడిచిపెట్టడానికి అంతర్జాతీయ ఆరోగ్య సంక్షోభం సరిపోతుందని ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ పేర్కొంది. వనులకు హాజరుకాకపోవడం, తక్కువ ఉత్పాదకత, స్లయిడింగ్ ట్రావెల్, పంపిణీ ఉత్పత్తులకు అంతరాయం కలిగించడం, వాణిజ్యం, పెట్టుబడులను తగ్గించడం వంటి వాటికి ఇది ఆర్థిక ధరను భారం చేస్తుందని తెలిపింది. పెట్టుబడిదారులు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు. యుఎస్ స్టాక్ బెంచ్ మార్క్ సోమవారం నాటికి 3శాతం కన్నా ఎక్కువ దిగజారిపోయింది.ప్రస్తుతానికి, సెంట్రల్ బ్యాంకర్లు, ప్రభుత్వాలు కొవిడ్ -19 ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పెద్దగా దెబ్బతీయవని సవాల్ చేస్తూనే ఉన్నాయి. వైరస్ ప్రభావం తగ్గిన తర్వాత మళ్లీ ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకోవటానికి ఇది అనుమతిస్తుంది. కానీ ఆ విశ్వాసంతో ఉన్నవారికి సవాల్ ఎదురువుతోంది. 2020 కోసం ప్రపంచ వృద్ధి అంచనా నుంచి 0.1 శాతం పాయింట్లను మాత్రమే వైరస్ ప్రభావితమైందని ఎఓఈ చీఫ్ ఎకనామిస్ట్ గీత గోపీనాథ్ అన్నారు. ఒక కరోనా వైరస్ అంతర్జాతీయ ఎమ్జ్గ÷న్సీ ప్రకటనతో అది నిజంగా ఎంతో భయంకర మైనదిగా పేర్కొన్నారు. ప్రతిరోజు కరోనా కొత్త కేసులు నమోదు కావడం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. దక్షిణ కొరియా, ఇరాన్, ఇటలీ పారాశ్రామిక భూభాగాలకు కరోనా వైరస్ వ్యాప్తి చెందే క్రమంలో మూతపడిన చైనీస్ ఫ్యాక్టరీలు తిరిగి ఆన్ లైన్ లోకి ఇంకా రావాల్సి ఉంది. చైనాలోని కరోనా విజృంభణతో ఎక్కువ సంఖ్యలో మరణాలు నవోదు కావడం, జనజీవనం స్తంభించిపోవడం వంటి పరిస్థితులు మరింత భయాన్ని పెంచుతున్నాయి. ఇప్పుడు ఈ వైరస్ ఇటలీలోనూ వ్యాపించి దేశాన్ని ఆర్థిక మాంద్యంలోకి నెట్టేయడమే కాకుండా మిగిలిన భాగమైన ఐరోపాను కూడా దెబ్బతీస్తుంది. కొరియా ఆర్థిక వ్యవస్థ క్రమంగా మందగిస్తోంది.

# జనగామలో మంత్రికేటీఆర్ ఆకస్మిక పర్యటన

### పట్టణ ప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలి
### వినాయకచవితి, దసరా పండగల్లా పారిశుద్య నిర్వహణ చేయాలి
### చెత్తతో ఎరువుల తయారీకి ముందుకు రావాలి
### పచ్చదనంతో ప్రతి వార్డు మెరవాలి

జనగామ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఐటీ, మున్సిపాలిటీ శాఖ మంత్రి కేటీఆర్ జనగామ జిల్లా కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. పట్టణ ప్రగతి కార్యక్రమం అమలుపై జనగామ పట్టణంలో కేటీఆర్ ఆకస్మికంగా పర్యటించి వివరాలు



జనగామ పట్టణంలో ఆకస్మిక తనిఖీలో పాల్గొన్న మంత్రి కెటిఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఉన్నారు.

తెలుసుకున్నారు. ధర్మకంచ బస్తీలో పర్యటించిన మంత్రి కేటీఆర్.. పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. పట్టణ ప్రగతిలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై స్థానిక ప్రజలతో కేటీఆర్ మాట్లాడారు. పట్టణంలో మరిన్ని స్వచ్ఛ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ యువత వినాయక చవితి, దసరా పండగల కన్నా బస్తీల పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఇప్పటినుంచి వారి ప్రధాన లక్ష్యం అదే కావాలన్నారు. యువత తమ వార్డుల్లో చెత్తలేకుండా,పచ్చదనం వెల్లివిరిసేలా చూడాలన్నారు. రోగాలను దూరం చేసుకోవాలంటే ఇదొక్కటే మార్గం అన్నారు. స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి రెండు బుట్టలు ఇస్తామని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. డంపింగ్ యార్డులో రెండు రకాల కార్యక్రమాలు చేపడతామన్నారు. తడి చెత్తతో ఎరువులు తయారు చేసి జనగామ పట్టణ ప్రజలకు అందిస్తామన్నారు. ఇళ్లలో చెత్త సేకరణకు రిక్షాల్లో కూడా వేర్వేరుగా డబ్బాలు ఏర్పాటు చేస్తామన్నారు. చెత్త నిర్వహణ ద్వారా సిరిసిల్లలో ఎరువులు తయారు చేస్తున్నామని అన్నారు. ఇక్కడా అలాంటి ప్రయోగం చేయాలన్నారు. చంపక్‌హిల్స్‌లో సేంద్రియ ఎరువులకు సిద్ధం కావాలన్నారు. వీలయితే సిరిసిల్లకు వచ్చి చూడాలన్నారు. మన పిల్లల భవిష్యత్ కోసం మొక్కలు నాటాలన్నారు. ప్రజలకు కావాల్సిన మొక్కలను నర్సరీల ద్వారా అందజేస్తావన్నారు. పట్టణంలో 85 శాతం మొక్కలు పెరగకపోతే కౌన్సిలర్, చైర్మన్ పదవులు ఊడతాయని అన్నారు. పట్టణాల్లో వాటర్ ఆడిట్ చేయాల్సిన అవసరం ఉందని కెటిఆర్ అన్నారు. నీటి వాడకం ఎంత జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. పార్కుల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయిసామన్నారు. రాబోయే రెండు నెలల్లో జనగామలో ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. రాబోయే రెండు నెలల్లో జనగామలో 100 టాయిలెట్లను నిర్మించాలని సంబంధిత అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు. సీఎం కేసీఆర్ వల్లే జనగామ జిల్లా అయిందన్నారు. ప్రజల దగ్గరకే పరిపాలన తీసుకువచ్చామని కేటీఆర్ తెలిపారు. అన్ని పట్టణాల్లో పచ్చదనం - పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వార్డు కమిటీలు పారిశుద్ధ్య ప్రణాళికలు అమలు చేయాలన్నారు. తడి చెత్తతో ఎరువులు తయారు చేసి జనగామ పట్టణ ప్రజలకు అందిస్తాం. తడి, పొడి చెత్త సేకరణకు రిక్షాల్లో కూడా వేర్వేరుగా డబ్బాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ ఆదేశించారు.

6 నెలల్లో విద్యుత్ స్తంభాలు, వేలాడే వైర్ల సమస్యలను పరిష్కరించాలి. అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాల్లో పందులు లేకుండా చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని కేటీఆర్ చెప్పారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొచ్చామని కేటీఆర్ పేర్కన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

### రాజస్థాన్‌లో ఘోరం...పెళ్లింట పెను విషాదం

# నదిలో పడ్డ పెళ్లి బస్సు: 24మంది మృతి

జైపూర్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పెళ్లింట తీవ్ర విషాదం నింపింది. బుంది జిల్లాలోని కోట లాల్‌సోట్ వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న బస్సు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి మేజ్ నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో 24 మంది మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో బస్సును బయటకు తీసేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. మృతదేహాలను బయటకు వెలికి తీస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ఉన్నట్టు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన బస్సు పెళ్లి బృందంతో వెళ్తున్నట్టు తెలుస్తోంది. కోటకు చెందిన వరుడి కుటుంబ సభ్యులు 40 మంది ఒకే బస్సులో సవాయ్‌మాదోపూర్‌లో జరగనున్న పెళ్లి మండపానికి బయల్దేరారు. పాపిడిగాన్ సమీపంలోని మేజ్ నది వంతెనపైకి రాగానే అదుపుతప్పింది. డ్రైవర్ ప్రమాదాన్ని గ్రహించేలోపే నదిలోకి దూసుకు పోయింది. స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టినా.. అప్పటికే 24 మంది మృతిచెందారు. ఘటనా స్థలికి చేరుకుని, స్థానికలతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో బస్సును బయటికి తీసేందుకు ప్రయత్నిసున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.మృతుల్లో 11 మంది పురుషులు, 10 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఘటనాస్థలి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. క్షతగాత్రులను సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



రాజస్థాన్‌లో నదిలో బోల్తాపడ్డ పెళ్లి బృందం బస్సు




# బాల వికాసం

## ఎగిరింది చూడు

ఎగిరింది చూడు
ఎగిరింది చూడు
జాతీయ పతాకం
మూడు రంగులతో
ముచ్చట గొలుపుతూ
ఎగిరింది చూడు
జాతీయ పతాకం
తెలుపు రంగు శాంతికి చిహ్నం
కాషాయం రంగు త్యాగానికి గుర్తు
ఆకుపచ్చ రంగు
పాడిపంటలకు చిహ్నం
దేశభక్తుల ప్రేమను తెలుపుతూ
ఎగిరింది జాతీయ పతాకం
జాతీయ పతాకం కోసం
ఎందరో దేశ భక్తులు
ప్రాణాలు విడువ
ఎందరో మహాత్ములు
చెరసాల కేగింది జాతీయ పతాకం
తెచ్చిరి అందరి కోసం స్వాతంత్ర్యం
త్యాగనిరతికి చిహ్నంగా
స్వాతంత్ర్యానికి మిన్నగా
పింగళివెంకయ్య జాతీయ పతాకం



– జి. ఇందు
8వ తరగతి

## జెండా మన జెండా

జెండా మన జెండా
మూడు రంగుల జెండా
పావురాలతో నిండి ఉన్న జెండా
బడిలో ఎగరేసే జెండా
జెండా మన జెండా
దేశానికి శాంతినిచ్చే జెండా
విరులు తెచ్చిన జెండా
స్వాతంత్ర్యపు జెండా
జెండా మన జెండా
ధర్మచక్రంతో ఉన్న జెండా
ఆకాశం అంత జెండా
పూలలో దాక్కున్న జెండా
జెండా మన జెండా
అందమైన జెండా
పౌరులు కాపాడిన జెండా
మూడు రంగుల ముచ్చటైన జెండా



–టి. హుసేన్ భాషా
8వ తరగతి

## రంగుల రంగుల జెండా

రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండా
స్వేచ్ఛనిచ్చే జెండా
అందమైన జెండా
రంగు రంగుల జెండా
మూడు రంగులజెండారా
కాషాయం రంగురా
త్యాగానికి గుర్తురా
రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండారా
తెలుపు రంగురా
శాంతికి గుర్తురా
రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండారా
ఆకు పచ్చని రంగురా
పాడి పంటలకు గుర్తురా
రంగు రంగుల జెండా
మూడు రంగుల జెండా
అశోక చక్రము కలదురా
దేశమంతట ఎగిరేరా



–కె. ఇందు,
8వ తరగతి



## కర్నూలు జిల్లా మద్దికెర మండలంలోని పెరవలి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కవితలు





## దేశ భక్తి

దేశమును ప్రేమించుమన్న
భారతమాతను గౌరవించుమన్న
మంచి అన్నది పెంచుమన్న
నాయకులను గుర్తుంచుమన్న
పాడిపంటలకు తోడు కల్గిన
సంప్రదాయాలకు అండ కల్గిన
సంస్కృతులకు అడ్డులేకున్న
సమసమాజ హితం కోరుమన్నా
పెద్దలను గౌరవించుమన్న
వృద్ధులకు సాయం చేయమన్న
దేశ భాగ్యం నిలుపుమన్న
దేశాన్ని రక్షించుమన్న
కర్షకులు స్వేద బిందువులు ధారపోసిన
అన్నదాతకు అండ లేకున్నా
రైతు కష్టం ఫలించకపోయిన
జనుల కల నెర వేరేనా.....



–బి. కీర్తి
8వ తరగతి

## జెండా పండుగ

రారండోయ్ రారండి
పిల్లల్లారా రారండి
జెండాపట్టుకు ఎగురేద్దాం
పువ్వుల వాన కురిపిద్దాం
మూడు రంగుల జెండా
ముచ్చటైన జెండా

మూడులోకాలందు
ఎగురవేసే జెండా
మహాత్ముని శాంతితో
తెచ్చిన జెండా
నెహ్రూ ప్రేమతో
ఆహ్లాదంతో తెచ్చిన జెండా

రారండోయ్ రారండి
పిల్లల్లారా రారండి
అందమైన పువ్వులో
ఉపాధ్యాయులతో కలసి ఎగురేద్దాం
జెండా పండుగ వచ్చింది
బహుమతులెన్నో తెచ్చింది
ఆహ్లాదంతో ఆడండి
ఆడుతు పాడుతూ మెలగండి
రారండోయ్ రారండి
పిల్లల్లారా రారండి
మూడు రంగుల జెండా
ముత్యాల జెండా



–యం. రుతిక
8వ తరగతి

## భూమమ్మ భూమి

భూమమ్మ భూమి
సహనం గల భూమి
రైతుకు ఆధారమైన భూమి
మానవ శరీరమును

కలుపుకునే భూమి
భూమమ్మ భూమి
కళేబరాన్ని దాచుకునే భూమి
దేవుళ్ళు, దేవతలు నడియాడిన భూమి
ఓ మంచి భూమి

భూమమ్మ భూమి
ఆధారమైన భూమి
అగ్నిపర్వతాలు దాచుకున్న భూమి
ఆస్తికుడు నాస్తికుడు తేడా లేని భూమి
భూమమ్మ భూమి
పంచభూతాలలో ఒక్కటైన భూమి
మంచు పర్వతాలు ఉన్న భూమి
భూమి అమ్మ భూమి.



–పి. రజని
8వ తరగతి

## ఆత్మీయ దేశం

జేజేలు
జేజేలు జేజేలు – పుణ్యభూమికి జేజేలు
బంగారు భూమికి జేజేలు
దేశనాయకులకు జేజేలు
జేజేలు జేజేలు– కన్నతల్లికి జేజేలు
భారతమాతకు జేజేలు
స్వాతంత్ర్య భూమికి జేజేలు
జేజేలు జేజేలు–ఉపాధ్యాయులకు జేజేలు
రైతుల పల్లికి జేజేలు
వానదేవుడికి జేజేలు
జేజేలు జేజేలు– సంప్రదాయాలకు జేజేలు
పంటచేన్లకు జేజేలు
అక్షరాలకు జేజేలు
జేజేలు జేజేలు – ప్రకృతి మొక్కలకు జేజేలు
శ్వాసనిచ్చే చెట్లుకు జేజేలు
ఆరోగ్యాన్నిచ్చే పండ్లకు జేజేలు



–యం. రుతిక
8వ తరగతి

# 'మూలమలుపు'లో బతుకు చిత్రాల కవిత్వం.






సాహితీలోకంలో ఏనుగు నరసింహా రెడ్డి గురించి తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదేమో. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి కాక ముందు నుండే ఒక కవిగా సుపరిచితులే. చిన్న పత్రిక నుండి అత్యధిక సర్క్యులేషన్ ఉన్న పత్రికల వరకు , అన్ని పత్రికల్లోనూ వారి కవిత్వానికి ఎందరో పాఠకులు ఉన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా రచనా వ్యాసంగంలో అనేక ప్రక్రియల్లో వారు రచనలు చేస్తున్నారు. ఆంధ్రప్రభలో 2016 నుండి అప్రతిహతంగా ప్రతి వారం రాసే రుబాయిలు వారి సాహితీ వ్యవసాయానికి నిదర్శనం. "పుస్తకాలు లేని ఇల్లు ఎడారి" అని చెప్పే ఈ కవి , తనను కలిసిన అందరికీ పుస్తకాలను జ్ఞాపికలుగా అందిస్తూ అక్షర సేద్యానికి విత్తనాలను పంచుతారు.

యాదాద్రి భువనగిరి జిల్లా మూసీతీరంలోని కల్లోనికుంటలో జన్మించి, నల్గొండ జిల్లా చిట్యాలలో పెరిగిన వీరి ప్రతి అక్షరంలోతెలంగాణ భాషాసౌందర్యం తొణికిసలాడుతుంది.

"అంతరంగం" అనే వీరి ఆధునిక కవిత్వ విమర్శ గ్రంథంలో ఇరవై ఆరు వ్యాసాలున్నాయి. వారి సునిశిత పరిశీలన , సున్నితమైన విమర్శకు అద్దంపడుతుంది ఈ "అంతరంగం"అనే పుస్తకం.

ఈమధ్య ఏమలుపులో విన్నా , ఏ పత్రికలో చూచినా ఒక పుస్తకం మీద చర్చే వినపడుతుంది , కనపడుతుంది. అదే"మూలమలుపు" అనే కవితా సంపుటి. అరవై రెండు కవితల సమాహారమైన ఈ సంపుటికి తెలంగాణ అకాడమీ అధ్యక్షులు నందిని సిద్దారెడ్డిగారు , కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ గారు ముందుమాటలు రాసారు. ఇందులో నాకు బాగా నచ్చిన కవిత "గూట్లో దీపం". పొద్దు పోక ముందే /గూట్లో దీపం పెట్టడం మంచిది/ హుషారుగా ఉన్నప్పుడే/ పిట్ట ఎగిరిపోవడం ఉత్తమం,

ఒకరికి పెట్టావని ఒకరు/ మాటల తూటాలు పేలుస్తారు/ వీళ్ళ పాల కోసమే తిన్న రోజుల్ని/ వీళ్ళ మురిపాల కోసమే నవ్విన గడియల్ని/ ఇప్పుడెలాగూ చెప్పలేను/ ఈ కన్నాల మాటలు/ వీళ్ళ కన్నాల భవిష్యత్ వాక్యాలు / కాకూడదనే తలపోస్తాను. ఎవరు ఈ లోకానికి ఎక్కువకాలం అక్కర్లేదు/ అందుకే పొద్దు పోక ముందే /గూట్లో దీపం పెట్టడం మంచిది" అంటారు. పెద్దలకు జరుగుతున్న దానికి బాధపడుతున్నా , పిల్లలకు తమ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలో చెప్తారు కవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏర్పడిన 31 జిల్లాలను తలపోస్తూ చెప్పిన కవిత "ముప్పయొక్క దీపాలు" దీపాలు కదా / అంటించిన కొద్దీ /విస్తరిస్తూ పోయినై/వెలుగుల మీదున్న ప్రేమకు / మట్టి బహువిధ రూప/ విన్యాసాలకు కేరింతలే/ అయితే దీపావళి నాడున్న శ్రద్ధ /ఎప్పుడూ కావాలి / 31 దీపాలు/ దివ్యంగా వెలిగేట్లు చూడాలె అంటారు నిజమే పోటీపడి మరీ మాకొక జిల్లా మాకూ ఒకజిల్లా అంటూ ఎగబడ్డ వారంతా ఆప్రాంతాల అభివృద్ధికి అంతే నిజాయితీగా పనిచెయ్యాలి మరి.

''గాయపడ్డాకే'' అనే కవితలో కనిపించని యుద్ధరంగంలో/ వినిపించని బాంబుల మోత/ అదృశ్యంగా ఆయుధాలు/ సదృశ్యంగా తేనె పలుకులు/ ప్రకటించే నీతుల మధ్య /బయటపడని ఎజెండాల నడుమ / అన్ని చురకత్తుల్ని/ తప్పించు కోవాలనుకుం టాను/ గాయపడకుండా/ ఉండాలనుకుంటాను/ చివరికి గాయపడ్డాకే ఇల్లు చేరుకుంటాను' ఔను ఈ అనుభవం నాది కూడా. నాదేకాదు ముసుగుల్లేని మనుషులందరిదీ ఇదే పరిస్థితి.

"అమీబా" అనేక కవితలో 'శత్రువు అమీబా / వాదం ఒక వాహిక / లక్ష్యం ఇప్పట్లో అర్థం కాదు/ మనకు అంతా అర్థమయ్యేసరికి/రెండ శిబిరాలు వాళ్ళవే" ఎవరు శత్రువో ఎవరు మిత్రడో గుర్తించలేని స్థితి. రాజకీయ పార్టీలదే కాదు ప్రజాఉద్యమాల్లో కూడా కప్పగంతులే చూస్తున్నాం.

"నాన్న" అనే కవితలో అద్భుతమైన వాక్యాలు రాశారు చూడండి "సమస్త విశ్వమూ/ శత్రుశిబిరమై తలపడ్డప్పుడూ/ నాన్న ఒక్కడే తోడై/ ముందుకు నడిపిస్తాడు/ దీపం నుండి / దీపం ప్రభవించినట్లు/ పిల్లలకూ/ నాన్న తన ఔదార్యాన్ని అందిస్తాడు"

నాన్నంటే అదే కదా. ఏంటో కొందరు నాన్నలు కిరాతకుల్లా మారుతున్నారు.

సరళమైన భాషలో ఎటువంటి శ్లేషలు లేకుండా చిక్కటి కవిత్వాన్ని చదవాలంటే ఏనుగు నరసింహారెడ్డి గారి కవితల వైపు మళ్ళాలిసిందే.

'పాంచ్ తారాభవన్', నీతుల ఎడారులు' వంటి కొత్తపద ప్రయోగాలు బాగున్నాయి.

ఈ మూలమలపులో నులివెచ్చని చలిలో నెగళ్ళను ఎగదోసే పండువెన్నల వంటి కవిత్వం ఉండదు కానీ, ప్రాణం ఉనికిని చాటే బాలసూరన్న లేలేత కిరణాల బతుకు చిత్రాలుంటాయి. చదవండి మీరు కూడా. రెడ్డన్న మరింత విస్తృతంగా సాహిత్య సేద్యం చెయ్యాలని కోరుకుంటూ....

ప్రతులకు: ఏనుగు నర్సింహారెడ్డి
సెల్: 8978869183



–జ్వలిత
9989198943

# పిల్లల పెంపకంలో 21 సూత్రాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

పిల్లల పెంపకంలో 21 అద్భుత సూత్రాలు పుస్తకం తల్లిదండ్రులకు దివ్యౌషధం లాంటిదని బీసీ సంఘం సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలో మంగళవారం కళా సుబ్బారావు కళావేదికలో డా॥ ఆర్.బి. అంకం రచించిన పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వకుళాభరణం కృష్ణమోహన్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో బాల్యం నుంచే పిల్లల పెంపకంలో తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కళా జనార్ధనమూర్తి, హరీందర్ రావు, రచయిత ఆర్.బి. అంకం, గాయకులు ఆర్. సంపత్‌కుమార్,ప్రముఖ కవి విమర్శకులు రమణ వెలమకన్ని పాల్గొన్నారు.

## నానీలు

చంద్రుడి నల్లమచ్చలు
మబ్బుల ముద్దులవని
తేల్చింది
ఆకాశ పంచాంగం

దేవుడికీ తప్పవు
బాధలూ పొట్ట పుజలూ
అందరిలో
ఆయనేగా మరి

శృంగార అంగారం
వెచ్చని హాయి
రెండు తనువుల
చెకుముకి రాళ్ళ స్పర్శ

పున్నమి సంతకు
నక్షత్రాలు రాలేదా?
మన్మథుడు
వెంటపడతాడనా?

పోటీతత్వంతోనే
స్ఫూర్తితో రాణింపు
నిత్యసాధనతోనే
సంగీతంలో వాయింపు.



– రఘుశ్రీ
సెల్: 9247108893

## నిశి స్వరం!

నిశీధి రాత్రులు,
నింగి నిట్టూర్పులు!
చీకట్లలో మసలు మసక కలలు,
తారలను బోలు మిణుగురులు,
మిణుగురులను బోలు తారలు!
విశాలమైన వీధుల్లో వీధి దీపాలు,
చీకట్లతో ప్రకాశవంతమైన జ్యోతుల,
వెలుగుతో గాఢమైన నీడలు!
ప్రతివారూ ఏకాకులే
ఈ రాత్రుళ్లలో!
ముఖ్యంగా ఏకాకులు,
ఏకాంతంలో,
మరింత ఒంటరి ద్వీపాలు!
కొవ్వొత్తులతో దేదీప్యమానమవును
నిదుర రాని నిశి రాత్రులు!
పుస్తకాలు నేస్తులు,
కరిగే క్షణాలు ఆస్తులు!
నిశ్శబ్దమూ ఓ సంగీతమే,
నీరవమూ ఓ సంభాషణమే!
తారల ఇసిక రేణువులు
జల్లబడ్డ ఎడారి,
నింగి ఓ ఇరుల దారి!
శ్మశానంలో సమాధిలా,
ఆకాశంలో శశాంకుడు!
కాటికాపరిలా తిరిగేవాడు,
కన్నుల చితిలో కలలు మండేవాడు!!
పరమ నిర్భాగ్యుడు వాడు,
పల్లవి లేని చరణం లాంటివాడు!
పదాలు పలకని గీతం వాడు,
ఎద లోతుల్లో గాయం లాంటోడు!!



– దండమూడి శ్రీచరణ్
9866188266

## ఏం తెలుస్తుంది ?

కృత్రిమ గర్భం నుండి
పుట్టిన ఆ అక్షరాలకి
ప్రకృతి గర్భం నుండి
జనించిన నా అక్షరాల
విలువ ఏం తెలుస్తుంది ?

సిజేరియన్ నుండి
బైటొచ్చిన ఆ అక్షరాలకి
పురిటినొప్పులనుండి
ఉద్భవించిన నా అక్షరాల
బాధ ఏం తెలుస్తుంది ?

కరెన్సీతో చదువు'కొన్న'
అహంకారపు ఆ అక్షరాలకి
స్వేచ్ఛతో చదువుకున్న
మమకారపు నా అక్షరాల
విధేయత ఏం తెలుస్తుంది ?

ఆ అక్షరాలు
కార్పొరేట్ 'వి అయితే
నా అక్షరాలు
సర్కార్ వి
( ప్రభుత్వ బడులను బతికిద్దాం )



–కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## మెరుపులు

మనసంటే అద్దము
పగుల గొట్టనపుడు
మనిషంటే నిబద్ధము
మాట తప్పనపుడు !!

ఉప్పు కాల్చదు
నిప్పు లాగ
ఊరు గెంటదు
మనిషి లాగ !!

రాయైన ఆయుధమే
రాటు తేలినపుడు
కాయైన విషమే
రుచి లేనపుడు !!

గావురం గంజీకి
వీపు దెబ్బలకు
పావురం శాంతికి
యుద్ధం ఆపేందుకు !!

అలుగు పారితే
చెరువు నిండినట్టు
మోము నవ్వితే
తృప్తి చెందినట్టు !!

తాటెక్కి జారితే
కాటికి పయనం
తలనొప్పి ఎక్కువైతే
రోగం ఖాయం !!

మబ్బు ఉరిమిందంటే
వర్ష సూచన
మనిషి నవ్వాడంటే
పని జరిగేనా !!

గొయ్యి తీయడమంటే
నెయ్యి చేయడంకాదు
గొప్ప మాటలంటే
కాపి చేయడంకాదు !!

అనుబంధం అంటే
ఆటలు కాదు
సంబంధం అంటే
మాటలు కాదు !!

మదిలో మంచిలేని
ఆలోచన వ్యర్థం
మనిషిలో మార్పులేని
జీవితం వ్యర్థం !!



–తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762.

## శవమేథయాగం

ఏదో విషపుగాలి వీస్తున్నది
కొమ్మలకు కాసిన కాయలనకు
సోకి పుచ్చిపోయి
రాలిపోతున్నాయి

భయానక రక్కసి
నిశ్వాస ప్రవాహానికి
చివురుటాకులు సీకిపోయి
గజగజ వణుకుతూ
కొమ్మకు దూరమై నేలపై
కాలుజాపుతున్నాయి.

మానవ ప్రాణాలు
హరించి శవాల గుట్టలను
పేర్చుతూ శ్మశాన
రాజ్యవిస్తరణ కోసం
విశ్వవ్యాప్తిసంక్రమికవై
శవమేథయాగం
చేస్తున్నావు.

కార్చిచ్చున్నా మేఘాల
ఏడుపుకు నెమ్మదిస్తుందేమో
కాని కరోనా కాటు సృష్టిస్తున్న
మహోత్పత మృత్యు
విస్ఫోటనానికి విశ్వం
విలవిలలాడుతున్నది



–కొప్పోలు యాదయ్య
9494273703

## నేటి కవిత



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

నమ్మలేని నిజాలు

నలుపు నీరు
లవణాల నిలయం
కొని తాగలేమ్
పెద్దల మాట
వివేక సుభాషితం
విశాల పథం
సాగితే గర్వం
పతంగుల విహారం
జీవిత సూత్రం

పైరు నాశనం
మిడితల దాడులు
ఆకలి కేక
ప్రాణ కోటికి
మౌలిక వ్యత్యాసాలు
మార్పు వచ్చెనా!



- రేడియమ్
9291527757

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 27-2-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

ఇదిదే మా ఆహ్వానం
డొనాల్డ్ ట్రంప్ నమస్తే!
ఇరుదేశాలు బలపడును
మిత్రులిద్దరు కలిస్తే!
అగ్రరాజ్య అధ్యక్షుడు
అమెరికాకు పుత్రుడు!
హాండ్ కలిపి అడుగు పెట్టే
ఇండియాకు మిత్రుడు!

శ్రీనిజాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# కవిత్వమనేది ఆవహిస్తే వదిలిపెట్టదు- డా॥ నందిని సిదారెడ్డి

(నేటినిజం ప్రతినిధి)

కవిత్వమనేది ఆవహిస్తే వదలిపెట్టదని, అలాంటి కవిత్వం ఆవహించి కవిత్వంలోని అన్ని ప్రక్రియల్ని సృశించి, అన్ని కవిత్వ రూపాల్లో అందెవేసిన చెయ్యిగా విరాజిల్లుతున్న ప్రసిద్ధ రూపకకర్త, సాహితీవేత్త డా॥ వడ్డేపల్లి కృష్ణ అని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥నందిని సిధారెడ్డి అన్నారు. ఈనెల 19న రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్కళాభారతి, తెలుగు సాహిత్య కళా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ప్రసిద్ధ రూపకర్త, సాహితీవేత్త డా॥ వడ్డేపల్లి కృష్ణ రచించిన 'తెలంగాణ రూపకములు- త్రివిక్రములు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా॥నందిని సిధారెడ్డి మాట్లాడుతూ వివిధ ఇతివృత్తాలతో రూపకాలు రచించటంతో పాటు జ్యోతిరావు పూలే, అంబేద్కర్, భాగ్యారెడ్డి, వర్మలపై కూడా రూపకాన్ని రాశారన్నారు. తెలంగాణ వైభవం, రామప్ప తదితర 16 రూపకాలు రచించడం విశేషమన్నారు. డా॥వడ్డెపల్లి రచనల్లో తెలంగాణ తనం కొట్టొచ్చినట్టు కన్పిస్తుం దన్నారు. సభాధ్యక్షత వహించిన తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ బి. శివకుమార్



ప్రసిద్ధ రూపకర్త, సాహితీవేత్త డా॥ వడ్డేపల్లి కృష్ణ రచించిన 'తెలంగాణ రూపకములు- త్రివిక్రములు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

మాట్లాడుతూ వడ్డేపల్లి కవిత్వం తెలంగాణ ఉద్యమంలో ఎంతో ఉపయోగప డిందని అన్నారు. ఇటు సాహిత్యం అటు సినిమా రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు. పుస్తక స్వీకర్త రమణాచారి మాట్లాడుతూ కళా, సాహిత్య, సినిమా రంగాల్లో రాణిస్తున్న గొప్ప వ్యక్తి వడ్డేపల్లి అని అన్నారు. నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతు 70 ఏళ్ళ వయసులో నిత్య యువకుడిగా ముందుకు సాగుతు అనేక రచనలు చేస్తూ పురస్కారాలు అందుకుంటున్న వడ్డేపల్లి కృష్ణను అభినందించారు. ప్రముఖ సాహితీ సంగీత విశ్లేషకుడు డా॥ వీవీ రామారావు పుస్తకాన్ని విశ్లేషించారు. తెలుగు విశ్వ విద్యాలయం లలిత కళల పీఠాధిపతి డా॥ కోట్ల హనుమంతరావు అతిథిగా పాల్గొని అభినందనలు తెలియజేశారు. సత్కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు జి. సత్యనారాయణతో పాటు తెలుగు సాహిత్య కళాపీఠం అధ్యక్షుడు చిక్కా రామదాసు ప్రధాన కార్యదర్శి పట్టాల అశోక్, ఉపాధ్యక్షుడు చిక్కా దేవదాసు సమన్వయకర్త లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డా॥వడ్డేపల్లి రచించిన గజల్‌ను గాయని హిమజారామం శ్రావ్యంగా, ఆలపించి శ్రోతలకు మధురానుభూతిని పంచారు. మొదట బతుకమ్మ శేఖర్ బృందం జానపద గీతాలు పాడారు.

## ప్రార్థన

నాకు నడుమంత్రపు సిరులివ్వకు
నన్ను భోగాలలో తేల్చకు
నన్ను సమాజం నుండి విడదీయకు
నన్ను నన్నుగా బ్రతకనీ!

నాలో అహంకారాన్ని పెంచకు
నరుడినన్న సత్యాన్ని మరపించకు
నరాలిని పీడించే క్రూరుణ్ణి చేయకు
నన్ను నన్నుగా బ్రతకనీ!

నాలో ఈర్ష్యా ద్వేషాలు పెంచకు
నన్ను రాక్షసునిగా మార్చకు
నన్ను పరాన్న జీవిని చేయకు
నన్ను నన్నుగా బ్రతకనీ!

నాలో దివ్యత్వాన్ని చూపకు
నన్ను నీలా దేవుణ్ణి చేయకు
నీలోని మానవత్వాన్ని ఇంకించకు
నన్ను నన్నుగా బ్రతకనీ!

నాకు అమృతం తాగాలని లేదు
నాకే షడ్రసోపేత బోజనమూ వద్దు
నా కడుపుకింత ముద్దచాలు
నన్ను నన్నుగా బ్రతకనీ!

నాకే విమాన విహారాలూ వద్దు
నాకే విశ్వయాత్రలూ వద్దు
నానేలపై బ్రతుకంతా ఇలా సాగితే చాలు
నన్ను నన్నుగా బ్రతుకనీ!

నన్ను నన్నుగా బ్రతకనీ
నన్ను నన్నుగా బ్రతకనీ!



- డా॥ తిరునగరి
సెల్: 93924 65475



పుస్తకాన్ని డా॥ రమణాచారికి అంకితం ఇస్తున్న రచయిత డా॥ వడ్డేపల్లి కృష్ణ.
వేదికపై బి.శివకుమార్, జి. సత్యనారాయణ, డా॥ కోట్ల హనుమంతరావు, డా॥వి.వి.రామారావు, డా॥నందిని సిదారెడ్డి, బైస దేవదాసు, చిక్కా రామదాసు.

## జ్ఞాపకం

ఎప్పుడో
అరవై ఏళ్ళ క్రిందటి మాట
పావలా వుంటే చాలు
సినిమాకెళ్లే రోజులు
నాన్న జేబులోంచి
పిట్టల్లా ఎగిరిపడేవి.
సుభాష్.. రహత్ మహల్‌లో
ఉదయం ఆటకు వెళ్ళిన
జ్ఞాపకాలు.
అక్కడో యువకుడుండే వాడు
లయబద్ధంగా పాడుతూ
వేళ్లతో చిటికెలు వేస్తు
ఎ ఎన్నార్‌లా స్టెప్పులేస్తూ
కాలర్ మడతలోని కర్చీఫ్‌తో
ముఖం నులుముకుంటు
విన్యాసం సాగుతుండేది.

మాదో బ్యాచ్ వుండేది
అశోకన్న, లక్ష్మణ్, యాదగిరి...
అందరం స్కూల్‌కనే బయలుదేరే వాళ్ళం
కోరి మరీ పాడించుకునే వాళ్లం.
షమ్మీకపూర్, ఎన్టీవోడు
పూనకం వచ్చిన వాడిలా
ఊగిపోయేవాడు.

బుకింగ్ కౌంటర్లు తెరిచారా
ఆడి పాడిన ఆకలి
ఆర్తిగా చేయి జాపేది.
గుప్పెడు నాణేలు మూటగట్టి
క్షణంలో పాట కనుమరుగయ్యేది.
మళ్ళీ... మ్యాటినీ ఆటకు
మరో పాటతో ప్రత్యక్షం.
దీపక్ మహల్.. బసంత్‌టాకీసులు కూడా
ఆ పాటతో మారు మ్రోగుతుండేవి
ప్రొద్దున పది.. రాత్రి పది వరకు.
చుట్ట బెట్టిన ఆ పాట యిప్పుడు

వినిపించడం లేదు
యిప్పుడా పాటకు
ఎనభైఏళ్ళు దాటుంటాయి
ఆ డ్యాన్సు అలిసి సొమ్మగిల్లి వుంటుంది
చిటికెలు వేసిన ఆ వేళ్ళు
చచ్చు బడి వుంటాయి
కానీ.. ఆ దృశ్యం..
సజీవంగా నన్ను వెంటాడుతోంది!!

(ఇటీవలే మరణించిన చిన్ననాటి నేస్తం అశోకన్న గుర్తుకొచ్చి..)



-రమణ వెలమకన్ని
సెల్: 9866015040

# మాతృభాషను పరిరక్షించుకోవాలి

మన యొక్క అభిప్రాయాలను ఎదుటి వారికి అర్ధమయ్యే రీతిలో తెలియజేసే సాధనమే భాష. తల్లిదండ్రుల నుండి సమాజం నుండి నేర్చుకుంటున్నామనే ఆలోచన లేకుండా సులభంగా వచ్చేది మాతృభాష. సమాజాభివృద్ధికి, భాషాభివృద్ధికి విడదీయరాని సంబంధం ఉంటుంది. మాట్లాడే భాషే రాసే భాషకు ఆధారం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన అన్ని భాషలకు లిపి ఉన్నది. లిపి ఉన్న భాష ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను తరువాత తరానికి తెలియజేయవచ్చు. మాతృభాషలో తీయని

మాధుర్యం అంతకు మించిన మాతృప్రేమ ఉంటుంది. మన కష్ట సుఖాలను, బాధలను, సంతోషాలను వ్యక్తపరచడానికి మాతృ భాషనే ఉపయోగిస్తాము. బతుకుదెరువు కోసం ఎన్ని భాషలు నేర్చిన పర్వాలేదు కానీ మాతృ భాషను మాత్రం మరువకూడదు. మనసులో మాట తేలికగా చెప్పే భాష అమ్మ భాష. ప్రపంచంలోని భాషాలన్నింటికి తగిన గుర్తింపు ఇచ్చేందుకు వివిధ భాషల గురించి అవగాహన కల్పించేందుకు 17 నవంబర్ 1999 న జరిగిన ఐక్యరాజ్య సమితి విద్యా విజ్ఞాన మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 30 వ సాధారణ సమా వేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది.

ప్రజలు నిత్యజీవిత అవసరాల కోసం భాషను విరివిగా ఉపయోగిస్తుంటారు. ప్రపంచీకరణ పుణ్యామా అని ప్రస్తుతం ప్రపంచంలో అనేక భాషలు కనుమరుగవుతున్నాయి. పరాయి భాష వైపు పరుగులు తీయడం వలన మన సంస్కృతి సంప్రదాయాలు నశిస్తున్నాయి. అజంతా భాషగా పేరుగాంచిన మన తెలుగు భాషను ఆంగ్లేయులు "ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్" అని మెచ్చుకోవడం జరిగింది. "దేశభాషలందు తెలుగు లెస్స" అని చాటిన శ్రీ కృష్ణ దేవరాయల ఆస్థానం అష్టదిగ్గజ కవులతో తళుకులీనగా నేడు కనీసం ప్రభుత్వ ఆదేశాలు కూడా తెలుగులో రాకపోవడం శోచనీయం. అంతరించి పోవు భాషలలో మన భాష కూడా ఉండకూడదనుకుంటే ఇప్పటికైనా ప్రజలు, ప్రభుత్వాలు మేల్కొనాలి. మాతృభాష పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి. అనేక ప్రాచీన తెగల భాషలు ఇప్పటికే తమ ఉనికిని కోల్పోయాయి. ప్రాచీన జాతుల వారసత్వాన్ని, వారి మాతృభాషను పరిరక్షించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి వ్యక్తి తన సొంత భాషను కాపాడుకోవడానికి కృషి చేయాలి.

మాతృభాషను చక్కగా నేర్చుకున్న వ్యక్తి పరభాషలు కూడా సులువుగా నేర్చుకోగలడు. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థికి సృజనాత్మక నైపుణ్యం ఎక్కువగా ఉంటుంది. కానీ ఆంగ్ల మాధ్యమంలో చదివిన విద్యార్థులు కేవలం తెలుగు మాట్లాడగలరు కానీ చదవడం, రాయడం చేయలేరు. ఇంగ్లీష్ పరిజ్ఞానం కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. నేడు వాట్సప్, ఎస్ఎంఎస్ లో చాటింగ్ కు వాడే ఇంగ్లీష్ చూసినట్లయితే ఇంగ్లీష్ ను ఎంత హీనంగా వాడుతున్నారో తెలుస్తుంది. ఇంగ్లీష్ మీడియంలో చదివిన విద్యార్థులు అటు ఇంగ్లీష్ రాక ఇటు తన మాతృభాష రాక సతమతమవుతున్నారు. కాబట్టి ప్రాథమిక స్థాయి వరకు అనగా నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు ప్రభుత్వ మరియు ప్రయివేట్ పాఠశాలలు అనే తేడా లేకుండా తప్పనిసరిగా ఇంగ్లీష్ ను ఒక అంశం (సబ్జెక్టు)గా చేర్చి మాతృభాషా మాధ్యమంలో (తెలుగు రాష్ట్రాలలో తెలుగు) బోధన చేసినట్లయితే విద్యార్థులు రెండు భాషల్లో ప్రావీణ్యం పొందే అవకాశం ఉంటుంది. ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి భోదన మాధ్యమాన్ని విద్యార్థుల ఇష్టానుసారం ఆంగ్ల మాధ్యమంలో భోదన చేస్తే సరిపోతుంది.

మహాత్మా గాంధీ గారి అభిప్రాయం ప్రకారం బిడ్డ శరీర పోషణకు తల్లి పాలు ఎంత అవసరమో మనో వికాసానికి మాతృభాష కూడా అంతే అవసరం. చాలా వరకు అభివృద్ధి చెందిన దేశాలలో మాతృభాషనే బోధన భాషగా ఉపయోగిస్తున్నారు. చాలామంది మేధావులు, మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం విద్యార్థి పాఠశాల విద్య మాతృభాషలో కొనసాగితేనే అతడు ఒత్తిడి లేకుండా సర్వతోముఖాభివృద్ధి చెందుతాడు. భాష మీద పట్టు లేకుండా చదివే విద్యార్థులలో అవగాహన సామర్థ్యం తక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు ఇంటి వద్ద మాట్లాడే భాష మరియు చుట్టూ ఉండే సామాజిక పరిసరాల ప్రభావం విద్యార్థి భాషపై తీవ్ర ప్రభావాన్ని చూపెడుతాయి. నేడు కొన్ని ప్రయివేటు మరియు కార్పొరేట్ పాఠశాలలో తెలుగు మాట్లాడితే శిక్షించడం కూడా చేస్తున్నారు. దీంతో విద్యార్థి ఇంగ్లీష్ పూర్తిగా రాక, తెలుగులో మాట్లాడితే శిక్షిస్తారనే భయంతో ఏమి మాట్లాడలేకుండా పాఠశాలలో గడుపుతున్నాడు. దీని ద్వారా ఆ విద్యార్థి మాట్లాడే నైపుణ్యం కోల్పోవడమే కాకుండా అతనిలోని సృజనాత్మకత, ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది. దేశ భవిష్యత్తు పిల్లల అభివృద్ధి పైనే ఆధారపడి ఉంటుంది. కానీ పాఠశాల విద్య పూర్తి అయ్యేసరికి దాదాపుగా సగం మంది విద్యార్థులకు కనీస సామర్థ్యాలు రావడం లేదనే కఠోర వాస్తవాన్ని వివిధ సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి. విద్య వ్యాపారమయం అయిన నేటి కాలంలో అధిక మార్కులే (గ్రేడులు) ధ్యేయంగా విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. వాస్తవంగా విద్యార్థులకు వచ్చిన మార్కులకు వారి సామర్థ్యానికి ఏ మాత్రం సంబంధం ఉండటం లేదు.

ప్రాథమిక విద్యలోనే విద్యార్థి భవిష్యత్ కు పునాది పడుతుంది. గుణాత్మక విద్య అందరికీ అందాలంటే శైశవం నుండి ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషనే ఉపయోగించాలి. అప్పుడే విద్యార్థి మేదోతనం, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే సమాజంలో చాలామంది తల్లిదండ్రులు మా పిల్లలు ఇంగ్లీష్ మీడియం వారికి తెలుగు చదవడం రాదని చాలా గొప్పగా చెపుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రపంచంలో పెద్ద భాషలలో ఒకటిగా ఉన్న తెలుగు భాష కూడా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. కేవలం ఇంగ్లీష్ భాషతోనే ఉద్యోగాలు వస్తాయనే భ్రమలో నుంచి తల్లిదండ్రులు బయట పడినప్పుడే మాతృ భాషకు ఆదరణ పెరుగుతుంది. ఏ మాధ్యమంలో బోధన జరిగినప్పటికీ విద్యార్థికి ఉన్న ఆసక్తి, అతని యొక్క వ్యక్తిగత సామర్థ్యం, సృజనాత్మకతనే భవిష్యత్తులో అతని ఉపాధికి, విజ్ఞానానికి మార్గదర్శకం అవుతాయనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. కాబట్టి ప్రజలు, ప్రభుత్వాలు సమిష్టిగా మాతృభాషాభివృద్ధికై కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.



- కందుకూరి భాస్కర్
9703487088

# మాతృభాషతోనే సృజనాత్మకత-డా॥ఎన్.గోపి





ప్రజలకు ఆంగ్లాభిమానం పెరగడం వల్లనే మన తెలుగు భాష వెనుకబడిందని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎన్.గోపి అన్నారు. మాతృభాష రాకుండా ప్రపంచంలోని ఏ భాషను మనం నేర్చుకోలేమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు భాష చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ మలుగ అంజయ్య అవధానిచే అష్టవధాన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ కావూరి శ్రీనివాస్, గొంటుముక్కల గోవింద్, కొత్తోజు జనార్ధన్‌చారి, బివివి సత్యనారాయణలకు మాతృభాష పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టన్ ఎన్. గోపి మాట్లాడుతూ పిల్లలు ప్రాథమిక, మాధ్యమిక దశలో మాతృభాషను నేర్చుకోవడం చదువుకోవడం వల్లనే తాను గొప్ప కవిని అయ్యానని, కీర్తి సౌధాలను నిర్మించుకున్నానన్నారు. కర్ణాటక తమిళనాడు వారికి మాతృభాష మీద అభిమానం ఎక్కువ అని, ఇంగ్లీష్ భాషను మన చెలికత్తెగా తీసుకెళ్ళాలిగాని, నెత్తిన ఎక్కించుకోవద్దన్నారు. అష్టావదానం తెలుగుభాషకే మకుతాయ మానంలాంటిదని అన్నారు. విశ్వసాహితి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జయరాములు మాట్లాడుతూ కనుమరుగవుతున్న తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు కే. రాజగోపాల్ నాయుడు, తెలుగుబాష చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి. బడేసాబ్, ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నక్క శ్రీనివాస్ యాదవ్, లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞరాజు, ప్రముఖ కవి ఏబీజే సత్యపాల్, బండికాడి అంజన్న, కృష్ణగౌడ్, మండల స్వామి, రాపోలు వెంకటేషం, డాక్టర్ ఎడ్ల కల్లేష్, డాక్టర్ పండాల నాగేశ్వర్ గౌడ్, అంజయ్య, డి. వెంకటేశ్వర్లు, డాక్టర్ జయప్రకాశ్, ఆవ మల్లయ్య, కే. సత్యనారాయణ, గంగు భరత్, శీనయ్య, మల్లికార్జున్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానము
తెలంగాణ సాహితి & తెలుగు పూలతోట సంయుక్త నిర్వహణలో
వెన్నెల సత్యం రచించిన
"అమ్మ నానీలు" పుస్తకావిష్కరణ





తేది: 1 మార్చి,2020, ఉ॥ 10 గం॥లకు వేదిక: జడ్పీ హైస్కూల్ (కుంటబడి),షాద్‌నగర్,రంగారెడ్డి జిల్లా.
ముఖ్య అతిథి & ఆవిష్కర్త
డా॥ఎన్.గోపి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత
సభాధ్యక్షులు
కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాళోజి పురస్కార గ్రహీత
గ్రంథ స్వీకారం
శ్రీమతి వడ్ల మోనమ్మ, కవి మాతృమూర్తి
విశిష్ట అతిథులు
వల్లభాపురం జనార్దన, రాష్ట్ర అధ్యక్షులు,తెలంగాణ సాహితి
కన్నోజు లక్ష్మీకాంతం, కవి,విమర్శకులు
ఆత్మీయ అతిథి
డా॥ వి. జయప్రకాశ్, పరిశోధకులు
ప్రత్యేక అతిథి
రాపోలు సీతారామరాజు యువకవి, దక్షిణాష్టికా
సహకారం
జ్యోతి, ఆసిఫ్
నిర్వహణ
సర్ఫరాజ్ అన్వర్






# పఠనీయ విరచిత "దశరథరాజనందన చరిత్ర"

తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటికీ నాంది పలికిన భూమి నిస్సంకోచకంగా తెలంగాణ. మొట్టమొదట రామాయణము, భాగవతము అనే మహాగ్రంథాలు తెలంగాణలోనే ఉద్భవించాయి. ఇవికాక తొలిశతకము, తొలి తెలుగు కావ్యం కూడా ఇక్కడే శ్రీకారం చుట్టాయి. అదే దశరథ రాజనందన చరిత్ర. ఈ చరిత్ర 16వ శతాబ్ధం, ఉత్తరార్థంలో పుట్టింది. ఈ గ్రంథం 1917 వ సంవత్సరం మరియు 1969వ సం॥లో ప్రచురించినట్లు తెలుస్తోంది. తెలంగాణ కీర్తి పతాకాన్ని ఎగురవేసిన ఈ కావ్యం ప్రస్తుతం మనకు అందుబాటులో లేదు. కనుక, పాఠకుల, సాహిత్యాభిలాషుల అభీష్టం మేరకు ఈ చరిత్రను పునర్ముద్రించారు.

రాముడు, లక్ష్మణుడు అనే పేర్లు ఉన్నాయనడానికి, రామాయణం జరిగింది అనడానికి అనేక దాఖలాలు ఉన్నాయి. ఈ అద్వితీయమైన పాండిత్యాన్ని ఆసూరి మరింగంటి సింగరాచార్యులవారు రామలక్ష్మణులను దశరథ రాజనందనులను కలిగినట్లే అనేక నామాలకు విశేషణాలతో కూడిన పేర్లను సృష్టించారు. అనేకానేక పదాలతో వ్యక్తులను నిర్దేశించారు. ఆకర్షణీయమైన లక్షణాలను చేర్చి పాత్రలకు జీవం పోసారు. అద్భుతమైన సర్వనామాలను, విశేషాలు, విశేషణాలను జతగలిపి విషయాన్ని విపులీకరించారు. నిజంగా ఈ చరిత్ర రచన అంటే గొప్ప ప్రయోగమనే చెప్పాలి. కష్టసాధ్యమైన పనిని ఎంతో ఆశక్తికరంగా మలచి పాఠకులకు అందివ్వడం ఆనందంగా ఉంది.

దశరథ రాజనందన చరిత్రము సింగరాచార్యుల కర్పూరాద్రి నరసింహ స్వామి పేర అంకితమొసగినాడు. దేవరకొండ తాలూకాలో పణ్కరాజుపల్లి అనే గ్రామం ఉంది. అది అడవి దేవులపల్లియను గ్రామానికి సమీపంగా ఉంది. పణ్కరాజుపల్లి వద్ద గుట్ట ఉంది. అందులో నరసింహస్వామి ఆలయం ఉంది. ఆ పర్వతమునే సంస్కృతీకరించి, కర్పూరాచలమని కవి తెలిపారు. మన సారస్వతములో తమ రచనలను గూర్చి తెల్పిన కవులు చాలా తక్కువనే చెప్పాలి. దశరథరాజనందన చరిత్ర మొట్టమొదటిసారిగా ఆంధ్ర సాహిత్యమున వెలువడిన నిరోష్ఠ్య కావ్యము. సింగరాచార్యులు దీనినే కాకుండా శుద్ధాంధ్రము నందును నిరోష్ఠ్యకావ్య రచన చేసి తెలగన్న కన్న ఒకటి రెండు మెట్లు యందు వెళ్ళారని తెలిపారు. వీరి సమకాలపు కవులలో భారత రామాయణ కథలను తీసుకొని స్వకపోలకల్పనలు చేసిన వారు అనేకమంది ఉన్నారు. తపతీ సంవరణోపాఖ్యానము, భారతీంతర్గతకథ, యయాతి చరిత్ర, రామయణ కథను హెచ్చుగా తెలిపారు. అప్పటికే భాస్కరకవి ఉన్మత్త రాఘవ నాటకము ప్రసిద్ధముగా వచ్చినది. తెలుగులో మొట్టమొదటి నిరోష్ఠ్య గ్రంథము, నరాంకితము కాదు. అనవసరమైన వర్ణనలు లేక ప్రబంధము లేదా కావ్యమునకు బరువును తప్పించినది. నాల్గవది దశరథనందన చరిత్ర 'యనికృతనామమును నిరోష్ఠ్యమే అని తెలియజేసారు.

ఇటువంటి ఎంతో ముఖ్యమైన గ్రంథాలను ప్రచురణకు ఆహ్వానించిన తెలంగాణ సాహిత్య అకాడమి వారికి అభినందనలు.

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి
ఫోన్: 040-29703142

పుస్తక సమీక్షలు








# పదునైన భావాల తీక్షణతతో "నడిచి వచ్చిన సూర్యుడు"

ఇక ఈ సమాజం మారదు..మానవత్వం కోల్పోయింది నేడు సమాజం అనుకోవడం నిత్యం పరిపాటిగా మారిపోయింది. అసలు సమాజం అంటే ఎవరు? నీవు నేను కూడా ఆ సమాజంలోని వారే కదా అని ఆలోచించేవారు ఎందరు? కాకుంటే ఒక్కమాట నిజం. అవిశ్రాంతత నేడు సమాజంలో ఉంది. పోరాటం, ఆవేదన, ఆక్రోశం, ఆగ్రహం తో నిత్యం సమాజం కొలిమిలా కాలిపోతోంది. ఇందుకు కారణం ఏమిటి అంటే కేవలం ఆలోచనారాహిత్యం. మనుషులందరూ ఒక్క నీలానో, లేక నాలానో ఉంటే ఏం బావుంటుంది? విరక్తి కలుగుతుంది. అందుకే విషం గక్కేవారుండాలి. అమృతం అందించేవారు ఉండాలి. అపుడే కదా మంచి చెడ్డ వ్యత్యాసం తెలిసేది. అయినా కనిపించే వేదనను, కనిపించని కష్టాలను గమనించి ఆర్తితో అక్షరాలతో అల్లుకునే తత్త్వం ఒక్క కవికే ఉంటుంది.

**"శ్రమ చుక్కలు దేహం నిండా పారినా/ కంటిలోని చుక్కలు రాలుతూనే ఉంటాయి/ అదికార్మిక దేహమైనా... కర్షక దేహమైనా/ శ్రమ చుక్కలను కప్పుకున్న సముద్రమే"**

**"పగలు రాత్రిని ఎంత జీర్ణించుకున్నా/ కాలపరీక్షలో నెగ్గలేరు/ ఆకాశం ఎంత చీకటిని కప్పుకున్నా/ నిక్షేపంగా అది శూన్యమే/ మనిషి మరణించి అంతమైనా / అతని ఆనవాళ్ళు సజీవంగా ఉంటాయి"** (ఆనవాళ్ళు)

**"ఇప్పుడు ఎక్కడ చూసినా/ జన జీవాలపై మృత్యు కవాటాలు/ తెరచుకుని ఆహ్వానిస్తున్నాయి/ పాలకు రాజకీయ మర్మంతో/ లాభాల పంటలను దున్నుకుంటున్నప్పుడు/ దేశం గుండె మీద కనిపించేది /మృత్యువు ఘోషలే"** (మృత్యుఘోష)

నిజమే.. మనిషి నేడు మరమనిషిలా తయారవడానికి కారణం మనస్సే మూలకారణం. మనసు ముంచగలదు. గెలిపించగలదు. రెండువైపులా పదునున్న ఈ మనిషి మనస్సు ఇన్ని సమస్యలకు మూలకారణం అవుతోంది. **"ఆకలిచుట్టూ జీవితం/ పొలం చుట్టూ ఆకలి/ సూర్యుడి చుట్టూ భూమిలా వారి జీవితాలు నిరంతరం పరుగులు తీస్తూనే ఉంటాయి"** అలాగే రక్తమోడిన పాదాలు, శ్రమచుక్కలు, నిరసనాగ్ని, అస్తమించని శ్రమ గీతాలు వంటి అనేక కవితలు అత్యంత గాఢతను తెలియజేసాయి. రాజకీయాలు, దోపిడీ హృదయాలు ఒకటేమిటి అనేక వస్తువులను విపులీకరించి వివర్ణ హృదయంతో నిలుస్తారు ఈ కవి. కులం, మతం అనేవి మనకున్న జబ్బులు.

ఆ జబ్బులకు మందులేదు. నిత్యం మన రక్తంలో ఇమిడిపోయిన ఈ పదాల మూలంగా మనకు నిత్యం ఎదురయ్యే సంఘటనలు ఎంత దారుణంగా ఉంటున్నాయో అని ఆవేదన చెందుతారు. మహ్మద్ నసీరుద్దీన్ ఒక బాధ్యత కవిగా ఈ కవిత్వం చదివితే అనిపిస్తుంది. ఇంకా సమాజానికి అతి ముఖ్యులైన రైతులు, స్త్రీలు, అట్టడుగు వర్గాల సానుభూతి, అవినీతి, దురహంకారం పట్ల విపరీతంగా స్పందించి తన కవిత్వం ద్వారానైనా ఏ ఒక్కరైనా మారకపోతారా అనే ఆతృత వీరి భావాల్లో ద్యోతకమవుతుంది.

ప్రతులకు: సాధిక్ యాస్మిన్
ఫోన్: 94402 37804








# హృద్యమైన "సంగమేశ్వర శతకం"

తెలుగు సాహిత్యం పద్యంతోనే ప్రారంభమైంది. ఈ అత్యాధునిక కాలంలో వచన కవిత్వం రాజ్యమేలుతున్న ఈ యుగంలో పద్యం ఇంకా ప్రజ్వరిల్లుతోందని అక్కడక్కడా శతకాలు, పద్య కావ్యాలు చూసినప్పుడు ధైర్యంగా ఉంటుంది. సోమనాథుని 'వృషాధిప శతకం' తో ప్రారంభమైన ఈ ప్రక్రియ రాను రాను వందలు, వేలు శతకాలు ప్రచురణలోకి వచ్చాయి. ఒకవిధంగా భక్తి శతకంతోనే శతక ప్రక్రియ ప్రారంభమైనది అని చెప్పుకోవచ్చు. పద్య రచన మూలం శతకం. ఏ శతకమైనా వంద పద్యాలు రచించడం పరిపాటి. మనిషి ఎంతగా ఎదిగినా నైతికత లోపిస్తే జన్మ పరిపూర్ణత నొందినట్లు కాదనే విషయం ఆధారంగా శతకాలు నైతికతకు, నీతికి పట్టం కట్టాయి. విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో రచించిన శతక ప్రక్రియ ఇప్పటికీ ఎవరూ మరచిపోలేరు. కవి కంతి మల్లేశం వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకుడు కావడంతో నీతిని చక్కగా చెప్పగలిగాడు. సంగమేశ్వర శతకం, నమామి రైతన్న అనే శతకాలతో పాటు కైతలమ్మపదాలు, రుబాయిలు రాబోయే రచనలుగా తెలియజేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే సంకటభవనాశ సంగమేశ అనే మకుటంతో సాగిన సంగమేశ్వర శతకంలోని పద్యాలు ఎంతో హృద్యంగా సాగాయి. ఉదాహరణకు కింది పద్యాలను గమనించండి..

**"స్వార్థబుద్ధి, ఆత్మ సంస్తుతి, పరనింద/ ఒజ్జసేవ విముఖతొకచో నున్న/**
**జన్మ శత్రువులివి జగతి విద్యలయందు/ సంకట భవనాశ సంగమేశ ॥**

**వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడే పద్యం ఇది.**

**"పాపకార్యమందు పాలుమీదెంతన్న/ తల్లితండ్రి భార్య తగదుయనిరి/**
**బోయవానికదియె బోధనంయనిరి/ సంకట భవనాశ సంగమేశ ॥**

**"ఓర్వలేని గుణమునొకని కీడును గోరు/ ఓర్వలేని గుణమునొకని దూరు/**
**ఓర్వలేని గుణము సర్వమునకు చేటు/ సంకట భవనాశ సంగమేశ ॥**

**"పుడమిలోన నొక్క పుణ్యాత్ముడుండిన/ వాని పుణ్య మనియు వసుధ బరువు/**
**కొంత తగ్గిపోవు కొండంత గల్గినా / సంకట భవనాశ సంగమేశ ॥**

**వంటి పద్యాలు అనేకం ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి.**

**"చీమకున్న యట్టి చిన్నపాటి తెలివి/ మనిషికున్న చాలు మంచి జరుగు**
**పయనమందు చూపు పక్కకు దిప్పునే/ సంకట భవనాశ సంగమేశ ॥"**

వంటి పద్యాలు సమాజం నుండి తోటి ప్రాణుల నుంచి మనం ఎంతో నేర్చుకుంటాం అనటానికి ఇది ఉదాహరణ. గేయ రచనలోను, పద్య రచనలోను ఎంతో నిపుణత కలిగిన కంతి మల్లేశం మరిన్ని పద్యాలను రచించాలని కోరుకుంటూ ... అభినందిస్తున్నాను.

ప్రతులకు: కంతి మల్లేశం
ఫోన్: 91603 96566

-శైలజామిత్ర

## అందని అక్షరద్రాక్షలు

స్వేచ్ఛగా విహరించాల్సిన
అందమైన అక్షరాలు
కాగితాల్లో నలుగుతు
చేతికందకుండ దూరంగ పారిపోతు
బంగారు భవితను అంధకారంలో
ముంచుతున్నాయి!

ఆట పాటల ద్వారా
అలవోకగా నేర్వాల్సిన పాఠాలు
నాలుగు గోడల మధ్య చితికిపోతు
చీకటి ప్రపంచం నుండి
బయటకు రానంటూ మారాం చేస్తున్నాయి!

దూకుతూ ఎగురుతూ వల్లెవేయాల్సిన ఎక్కాలు
మాస్టార్ గారి బెత్తానికి వణికిపోతు
చిన్ని బుర్రలోకి దూరడం చేతకాక
తలుపు సందుల చాటున నక్కి
దొంగచాటుగా తొంగి చూస్తున్నాయి!

మారుతున్న కాలానుగుణంగా
మారలేని విద్యావ్యవస్థ
వ్యాపార వస్తువుగ మారి
అందని ద్రాక్షగా మారి ఊరిస్తు

ప్రైవేట్ రంగా కళేబరానికి
ఎప్పటికప్పుడు తరలించబడుతు
పేదల చేత కన్నీళ్ళు పెట్టిస్తున్నాయి!!



-జవేరియా
9849931255

## ఓ మహిళా

ప్రేమకు పర్యాయ పదంలా
నిలిచి ఓ మహిళా..
ఓ ఇంటి ఇల్లాలుగా
కుటుంబ బాధ్యతలు మోస్తూ
చాక చక్యంగా
సంబంధ బాంధవ్యాలను
కలుపుకుపోతూ
అత్తింట.. ఏ పుట్టింటి గౌరవానికి
భంగం వాటిల్లక
అమ్మలా ప్రేమను పంచి
కంటి పాపలా కాపాడుతూ
అక్కగా అనురాగాన్ని పంచుతూ
చెల్లాయిగా చెలిమినందిస్తూ
అత్తమామలకు సేవలనందిస్తూ
అతిథులను, అభాగ్యులను
అనాథులను ఆదరిస్తూ
ఓర్పుగా, నేర్పుగా
కుటుంబ బరువు, బాధ్యతలను అలరించే
ఓ మహిళా..
నీకు శతకోటి వందనాలు...



-రాయవరపు సరస్వతి
9885656356

## అక్షరాలే నాకు ఓదార్పు...!

నా జీవనగమనంలో
సజీవమైన కష్టనష్టాలకు...
ఎదురయ్యే సుఖదుఃఖాలకు...
అనేకానేక ఒడిదుడుకులకు
మానవమానాలకు..
ఈర్ష్యా ద్వేషాలతో
పరుల దూషణలకు..
కోపోద్రిక్త మాటలకు..
గుండెనిండ వేదన
దంపించునప్పుడు..
ఇరుగుపొరుగు..
చాడీలతూటాలకు
మనసు విలవిలలాడ
నాకనుదోయి నుండి
ఉబికి కార్చు కన్నీరు...
జలజలమనిఎదను
తడుపుతూవున్న
సమయాన...పైవన్నీ
లోకసహజప్రవృత్తులే...
సంతోషంకల్గినప్పుడు
డెందమానందమొందలేదా!
మరీ! కష్టదుఃఖాలకు
అతలాకుతలమైతే ఎట్లా?
నీకు..వెన్నుదన్నుగా
నీసమస్యలకుబాధలకు..
నీకనుదోయిఎంతగా కన్నీరు కార్చేదీ..
నీకు ధైర్యాన్నిచ్చేందుకు
నీ కోసం నీలోని నేనెంతైనా
అక్షరపదధారవోస్తా...
నీకన్నీటీమయ జీవితానికీ
సదా నే ఓదార్పుగా వుంటా..
ఆవేదనను అక్షరానందంగా
మారుస్తా మిత్రమా! ఎందుకుభయం?
నేను నీకభయం...నీ కన్నీటి బొట్లను..
నవ్యకావ్య పన్నీటి రసావిష్కరణ చేస్తా....!!!!



-శ్రీమతి చింతోజు పద్మావతీసువర్ణ
8464954860.

## పుస్తకం

నా ఒంటరి నేస్తం
అజ్ఞానపు దారిలో
వెలుగు దీపం!

కాలక్షేపానికి మందు
ఉత్సాహానికి ప్రేరణ
నిరాశకు బద్ధ శత్రువు
బద్ధకానికి బుద్ధి చెప్పే గురువు!

ఒంటరి తనంలో
నీడలా వెంటాడే తోడు
పుస్తకం
మస్తకాలను పదునుపెట్టే
సానరాయి!
ఆలోచనల నిప్పురవ్వల్ని రాల్చే
చెకుముకి రాయి!

కొత్త లోకపు
మెట్లు ఎక్కించి
మైమరపింప చేస్తావు!
ప్రపంచాన్ని
నీ పుటల్లో దాచిన
అనంత విజ్ఞాన సర్వస్వానివి!

ఓ పుస్తకమా!
నువ్వులేని లోకం
అక్షరాలా చీకటి గుహనే!!



-అనిత దావత్
9394221927

## మధురవాణి

బలమును మరచి బలహీనునిగా బ్రతికి
తన బలమును మరచుట తగదన్న
తన బలమే తనకు రక్షయని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

మానవసేవలు మరచి మాధవసేవలు చేసి
మానవులను మరచుట మంచిది కాదన్న
మానవసేవయే మాధవసేవని సేవలు చేయాలని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

పగలు నిద్రించి రాత్రి మేల్కొని
పనులు చేయుట మంచిది కాదన్న
పగలు నిద్రతొ పనులు చెడునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

బడులు తెరచి చదువులు నేర్పి
క్రమశిక్షణ లేని చదువులు ఎందుకన్న
క్రమశిక్షణ లేని చదువు పనికిరాదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

బట్టలు ఉతికి మైలను తీసి
ఉతికిన బట్టలు తొడుగుట మంచిదన్న
ఉతికిన బట్టలే ఆరోగ్యానికి మంచిదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.



-జాధవ్ పుండలిక్ రావు
9441333315

## మనసు భందం

ఒక చూపు
కొన్ని బంధాలను కలుపుతుంది
మనసుకు తోడుగా ఒక నవ్వు
మనసు లోని ఆత్మీయత తట్టి లేపుతుంది.
ఒక పలకరింపు
యుగాల మౌనం మాయం చేసి
మోడు వారిన మనసు మరల చివురించేలా
ఎన్నో వసంతాలు దరి చేరుస్తుంది



-కవిత రాయల
8886066444

# ధర్మ విప్లవ యోధుడు దాశరథి-ఆచార్య ఫణీంద్ర



ఆచార్య ఫణీంద్రను సత్కరిస్తున్న బైస దేవదాసు. వేదికపై రాధశ్రీ, సాధన నరసింహాచార్య.

నాగారం, ఫిబ్రవరి 26 (నేటినిజం ప్రత్యేక ప్రతినిధి):నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కలంయోదుడు దాశరథి అని ప్రఖ్యాత పద్యకవి ఆచార్య ఫణీంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం రాధశ్రీ గారి రసవాహిని ఆధ్వర్యంలో నాగారంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడుతూ దాశరథి కవిత్వ విశేషాలను సోదాహరణంగా వివరించి అందరి మెప్పుకొందడం విశేషం. సభకు నేటినిజం సండదకులు బైస దేవదాసు అధ్యక్షత వహించగా సాధన నరసింహాచార్య సభా సంచాలనం చేశారు. రామకృష్ణ పరమహంస జీవితాన్ని, దాశరథి గొప్పతనాన్ని, మాతృ భాష మాధుర్యాన్ని, పద్య రూపంలో రాధశ్రీ వివరించారు. ఈ కార్యక్రమంలో కావ్యసుధ, మాదిరాజు, నాగరాజు, లక్ష్మీనారాయణ, నరసింహ ప్రసాద్, ఉదయ బాబు, డా॥నలవోలు నరసింహారెడ్డి, ప్రభాకర్, ఛవళి, శ్రీమతులు సంధ్య, అమృతలక్ష్మి, కామేశ్వరి, వేదవతి, తమతమ కవిత్వంతో సభకు రంజింపజేశారు. కవులందరినీ రాధశ్రీ దంపతులు సత్కరించి వందన సమర్పణ చేశారు.

## ఫుడ్ డెలివరీ బోయ్

నీవొస్తుంటే దూరం నుంచే
వాసనలు గుభాళిస్తుంటాయి
నీవు మోగించే కాలింగ్ బెల్
నా ఆకలికి కామా పెడ్తుంది
నీ భుజానికి తగిలించుకున్న బ్యాగే
అన్నపూర్ణ అవుతుంది
ఫుడ్ డెలివరీ చేసే నిన్ను చూస్తుంటే
కడుపు నింపే పూటకూళ్ళ
అమ్మే గుర్తొస్తుంది
నవ్వుతూ బిల్లిచ్చే నిన్ను చూస్తే
నలభీముల నకలుగా అన్పిస్తావు
వాహనంపై తీవిగా ఆర్డర్ చేసిన
ఆహారాన్ని అందించే
ఆపద్బాంధవుడవే అవుతావు
మార్నింగ్ అయినా,మధ్యాహ్నమైనా
ఈవినింగ్ అయినా,రాత్రైనా
ఏ సమయంలోనైనా ఆకలితీర్చే
పుంభావ పాక అమృతవు నీవు
ఆర్డరేదైనా నియమిత సమయంలో
నిస్సందేహంగా, గరమ్-గరమ్ గా
అందించి,ఆదుకుంటావు
ఫుడ్ డెలివరీ బోయ్
ఋణపడ్డది నీకు భుభుక్షాలోకం
నీ మైకం కమ్మి వంటగది
మసి వదిలించుకుంటుంది
చిమ్నీలు చిన్నబోయి
చీకటిని ఆశ్రయిస్తున్నాయి.



-డా.రామక కృష్ణమూర్తి
7989661142

# వీణావాణికి దేవులపల్లి పురస్కారం ప్రదానం



దేవునపల్లి వీణావాణిని సత్కరిస్తున్న అతిథులు.

సీనారె-వంశీ విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో తెలంగాణ అటవీ శాఖ వరంగల్ అటవీ క్షేత్ర అధికారి, కవయిత్రి దేవునపల్లి వీణావాణిని గానసభలో సత్కరించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని "దేవులపల్లి కృష్ణశాస్త్రి-వంశీ సాహితీ పురస్కారాన్ని' వీణావాణికి ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ దేవులపల్లిలోని భాషా సౌందర్యం వీణావాణి కవిత్వంలో ఉందని, బావుకత గొప్పగా ఉందన్నారు. ఆమె నిక్వణ-కవితా సంపుటిలో మంచి కవిత్వం ఉందన్నారు. **గోరింట పూచింది కొమ్మలేకుండా/ విప్వమంత విభుడుంటే/** తదితర దేవులపల్లి కవితాపంక్తుల్ని ఆయన విన్పించారు. కాలేజీ రోజుల్లో విప్లవాన్ని, ఆ కవిత్వాన్ని, శ్రీశ్రీని ఇష్టపడ్డా, పాఠ్యాంశాల్లో దేవులపల్లిని చదువుకున్నామన్నారు. లైబ్రరీలో నాడు జరిగిన ఓ మీటింగ్‌లో కృష్ణశాస్త్రిని చూసే అదృష్టం కల్గిందన్నారు. నేడు కవులను చూడాలని, వారి కవిత్వాన్ని చదవాలనే ఆసక్తి యువతలో సన్నగిల్లడం బాధాకరమన్నారు. నేడు వాట్సాప్‌లో కవిత్వ వరద పారుతుందని అదీ ఒకందుకు మంచిదేనని, మంచి కవిత్వం చివరకు మిగులుతుందన్నారు. దేవులపల్లి భాద ప్రపంచపు భాద అని చలం పేర్కొనడాన్ని డా॥ ముక్తేవి భారతి ఈ సందర్భంగా పేర్కొన్నారు. పవిత్రమైనే ప్రేమను దేవులపల్లి తన కవిత్వంలో ఆవిష్కరించారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కళా జనార్ధనమూర్తి, డా॥ తెన్నేటి సుదాదేవి, వంశీరామరాజు, డాక్టర్ తిరునగరి, దేవకీ దేవి మింజ, డా॥ కేతవరపు రాజ్యశ్రీ, శైలజామిత్ర, మాధవీలత, శాంతిప్రబోధలు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కవితల పోటీలు

సృజనసాహితి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ బాపురం నరహరి రావు పురస్కారం కొరకు కవితలను ఆహ్వానిస్తున్నాము.

కవిత నిడివి 20 వరుసలకు మించరాదు విజేతలకు ప్రథమ బహుమతి 1,000/- ప్రోత్సహకర 500/- చొప్పున రెండు కవితలకు వీరికి సభలో పురస్కార ప్రదానం జరుగును మీ కవితలు మాకు చేరవలసిన చివరి తేదీ: **31.03.2020**

అడ్రస్: శివేగారి చిన్నికృష్ణ, కాలువపల్లి, ఎంపీ. కొటూరు పోస్ట్, పలమనేరు మండలం, చిత్తూరు జిల్లా, పిన్ కోడ్: 517408 చరవాణి: 6300318230

## నేటి నిజాలు



## రవీంద్రభారతిలో ప్రసరించిన 'కవన కిరణాలు'

# మానవత్వం కోల్పోకుండా వుండేవాళ్లే కవులు- డా॥నందిని సిధారెడ్డి

('నేటినిజం' ప్రత్యేక ప్రతినిధి)

మానవత్వం కోల్పోకుండా ఉండేవాళ్లు కవులని తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. ఈ నెల 19, బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ కవి మంచాల శివ సంపాదకీయంలో వివిధ ప్రాంతాలకు చెందిన 22 మంది తెలుగు కవులు రాసిన కవితా సంకలనం 'కవన కిరణాలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిని సిధారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి కవులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన మనసుతో రాసిన కవితలున్నాయని తెలిపారు. ప్రతి వాక్యంలో అద్భుతమైన భావాలు కల్పించేలా రచించారని కొనియాడారు. సాహిత్యం సమాజం హితం కోరేలా ఉండాలని సూచించారు. సామాజిక అంశాలపై ఈ తరం కవులు స్పందించిన తీరు గొప్పగా ఉందన్నారు.

ఆలస్యంగా కవిగా మొదలై అందరి హృదయాలను చూరగొంటున్న దేవానంద్ నాగెల్ల దీనికి ముందు మాట రాయడం అనేది గతకాలంలో ఉన్నటువంటి సంప్రదాయాన్ని కొంచెం మార్చడం. ఏంటిది ఆ మార్చడం అంటే కవన కిరాణాలులో ఉన్నటువంటి ఇరవై మంది కవులు సహకార పద్ధతిలో సంకలనం వేసుకుంటూ, అదే సమయంలో వాళ్ళతో నిరంతరం వెన్నుదన్నుగా వుండే ఇంకో కవిమిత్రుడితో ముందు మాట రాయించడం అనేటువంటిది ఈ కవన కిరణాలు సాధించినటువంటి విజయం. ఈ సహకారపద్ధతి ఆలోచన, కవి కిరణంగా తానొక్కడే వెలగడం కాకుండా . ఇంకా చాలా కవికిరణాలు వున్నాయని ఇరవై మందిని ఒక్కచోట చేర్చి , ఆ ఇరవై మందిని సహకార పద్ధతిలో వెలుగులోకి తీసుకొచ్చిన ప్రత్యేకత శివ మంచాలది. నిజానికి ఇలాంటి మార్పు చాలా మంచిది ఎందుకంటే ఎవరి మీద ఆధారపడకుండా పుస్తకం తీసుకుని రావడం.

కవన కిరణాలు పుస్తకంలోని సుకన్య వేదం, శివమంచాల మరో ఇద్దరి కవితల్లో రెండు మూడు పాదాలను తీసుకుని సిధారెడ్డి విశ్లేషించారు. ఇందులో వుండే ఇరవై మంది కవులు ఇప్పుడు కిరణాలుగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో సూర్యులుగా వెలుగొందాలని కవులను అభినందించారు.

సభాధ్యక్షులు కవి, బహుజన సాహిత్య అకాడమీ మహారాష్ట్ర శాఖాధ్యక్షులు దేవానంద్ నాగెల్ల మాట్లాడుతూ 'బందారంలో వెలిసిన మందారం' అంటూ ముందుగా నందిని సిధారెడ్డి గారిని శ్లాఘించారు. ఈ కవన కిరణాలు పుస్తకం ఇలా ఈరోజు హైదరాబాద్ లో ఆవిష్కరణ సభ జరుగుతోందంటే ప్రధాన కారకులు శివ మంచాల. ఈ పుస్తకంలో అభ్యుదయం వుంది, విరసం వుంది , సరసమూ వుంది . అన్నిటినీ కలగలిపింది కవన కిరణాలు . సమాజాన్ని ప్రశ్నించే కవితలు, సమాజానికి కవుల విలువ



పుస్తకావిష్కరణలో చింతకింది శంకర్, ఈరబత్తిని రవి, సాహిత్య ప్రకాశ్, శివమంచాల, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥నందిని సిధారెడ్డి, దేవానంద్ నాగెల్ల, డా॥ నాళేశ్వరం శంకరం, దోమల జనార్ధన్, మౌనశ్రీ మల్లిక్.

తెలియజేసే కవితలూ వున్నాయి. ఈ పుస్తకంలో కవితలు వున్న కవులందరికీ దేవానంద్ అభినందనలు తెలిపారు. సాహిత్యం అనేది అజరామరం. దేనికీ లేని శక్తి ఒక్క సాహిత్యానికే వుంది అని అర్థం చేసుకున్నాను. నేను ఒకప్పుడు ఇక్కడి నుంచి ముంబై లో ఒక కూలిగా అడుగుపెట్టాను. ఇప్పుడు నాకు కార్లు, బంగళాలు వున్నాయి. కానీ నిజమైన ఆత్మసంతృప్తి లేకుండా వుండేది. అయిదు సంవత్సరాల క్రితం మొదటిసారిగా నాకు కవి రచయిత సంగవేని రవీంద్రతో ఏర్పడ్డ పరిచయంతో సాహిత్యంపట్ల ఆసక్తి పెరిగింది. నేను ఇరవై సంవత్సరాలు కూలీగా పనిచేసి డబ్బు సంపాదించినా రాని సంతోషము, నేను ఏ సి కారులో తిరుగుతున్నప్పుడు కలగని ఆనందం నా 'నిప్పుల కెరటం' పుస్తకం ఆవిష్కరణ అయ్యింతర్వాత కలిగింది. ఎంత ఆనందపడ్డానో మాటల్లో చెప్పలేను. అక్షరంలో వుంది , సరస్వతీ అమ్మలో వుంది అసలైన విలువ అని అర్థమైంది అన్నారు. ఇలా సహకార పద్ధతిలో పుస్తకాలు రావాలని, వాటికి నా సహకారం ఉంటుందనీ, దీనికి ముందు మాట రాసే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని, కవన కిరణాలు కవులందరికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాస్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ రాయాలన్న తపనతో , రాస్తున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని , అక్షర సృష్టి గావిస్తున్న వారు మనకు చాలా మంది కనిపిస్తున్నారు. జీవితంలో తనకెదురవుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని, తనకు కలిగిన బాధలను, సంతోషాలనీ హృదయం లోంచి తెల్లకాగితం మీద పెడుతున్న అక్షర సృష్టికర్తలే ఈ కవన కిరణాల్లో వున్న ఇరవై మంది



'కవన కిరణాలు' సంపాదకులు కవి శివమంచాలను సత్కరిస్తున్న అతిథులు సాహిత్యప్రకాశ్, బైస దేవదాసు, డా॥నందిని సిధారెడ్డి, దేవానంద్ నాగెల్ల, డా॥నాళేశ్వరం శంకరం, జక్కని గంగాధర్.

కవులు, కవయిత్రులు. సెల్ ఫోన్ ద్వారా శివమంచాల అన్ని ప్రాంతాల కవులతో సత్సంబంధాలు ఏర్పరుచుకుని, కవులు కాని వారిని కూడా కవులుగా తయారు చేసే ప్రయత్నంలో వాళ్ళలో ఆలోచనలను రేకెత్తిస్తూ అందరినీ ఒకచోట చేర్చడానికి చేసిన మొదటి ప్రయత్నమే ఈసభ అని తెలుస్తోంది. కవిత్వం రాస్తే ఏమోస్తుందని చాలా మంది అంటూ వుంటారు. ఈ సభలో డెబ్బై ఏళ్ళు నిండిన ఒక కవి వున్నాడు. ఆయన పుస్తకాన్ని నేను గత ఏడాది షోలాపూర్ లో ఆవిష్కరించాను. ఆయన పేరు ఓగన్న . ఆయన కవిత్వం ఎందుకు రాస్తున్నాడు అని ప్రశ్నించుకున్నప్పుడు ఒక ప్రభుత్వ ఉద్యోగిగా, పదవీ విరమణ చేసిన తర్వాత , తన మదిలో కలిగిన భావాలకు అక్షర రూపమిచ్చి ఒక పుస్తకం తెచ్చాడు. ఎందుకు రాస్తున్నాడూ అంటే సమయాన్ని వృధా చేసుకోకుండా, మనసు మరో దారికి మళ్ళకుండా , మనుషుల్లో మనీషిగా జీవించాలన్న తపనతో తన భావాలను కాగితంపై పెడుతున్నాడు. ఆ రకంగా తన మిగతా జీవితాన్ని ఆనందంగా మలచుకోవడానికి చేస్తున్న తాపత్రయమన్న ఓగన్నలాంటి వారిని ఎంతో మందిని చూస్తున్నాము.

మంచి సాహిత్యం చదవడం వల్ల, మన మనసు కుదుటపడటమే కాకుండా, మనకెదురవుతున్న సమస్యలను పరిష్కరించుకుంటూ, మనం మనకోసమే జీవించడం కాకుండా , నలుగురి కోసం జీవించే ఆలోచనా విధానం కలిగేదే కవిత్వం అని అన్నారు. మనసులో కలిగే భావాలను బయటకు తీసుకురావడమే బాధ్యత. అవార్డుల కోసమో, రివార్డుల కోసమో , పురస్కారాల కోసం రాసే కవిత్వం మనకు అవసరం లేదు. మనల్ని మన జీవితాల్ని మలచుకోవడానికి రాసే కవిత్వమే ఇప్పుడు కావాలి.

ఒకమంచి ఆలోచనతో శివ మంచాల చేసిన ఈ ప్రయత్నం చాలా గొప్పది. ఇది మొదటి ప్రయత్నమే అయినా ఈ ప్రయాణం ఆగకుండాముందుకు సాగాలని కోరుకుంటూ బైస దేవదాసు కవులకు శుభాకాంక్షలు తెలిపారు.

సినీ,టీవీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ కవిత్వం ఎంతో గొప్పది. అందుకే ఇక్కడికి ఇంతమంది ఎక్కడెక్కడి నుంచో వచ్చారు. మరీ ముఖ్యంగా ముంబై నుంచి. దీనికి కారణం కవిత్వమే. అందుకే కవిత్వాన్ని జయహో అందాం. కవిత్వం హృదయానికి హత్తుకుపోయేలా వుండాలి . కవిత్వాన్ని బాగా చదవడం వల్లనే అదిసాధ్యమని అన్నారు.

టీవీ యాంకర్, కవి, నటుడు సాహిత్య ప్రకాశ్ మాట్లాడుతూ కవిత్వం వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయి. కుల,మత,ప్రాంత,స్థాయీ బేధాల్లేని ఒక సమాజం ఆవిష్కృతం అవుతుంది. అంతే కాదు అక్షరంతో మమేకమైన వాళ్ళకు ఆయుష్షు కూడా పెరుగుతుందని అన్నారు. నేను కవిగా మారాక రవీంద్రభారతి వేదిక మీద ఒక్కసారైనా కవిసమ్మేళనంలోనో, ఏదో ఒక కార్యక్రమంలోనో పాల్గొనాలని కలలు కనేవాడిని, అది ఎంతో కాలానికి నెరవేరింది.

కానీ, కవన కిరణాలు లోని ఇరవై మంది కవులకు మొదటిసారే రవీంద్రభారతి లాంటి గొప్ప వేదిక మీద కవిత్వాన్ని చదివి, సన్మానం అందుకునే అవకాశం రావడం ..నిజంగా మీరు అదృష్టవంతులనే చెప్పాలి. తెలుగు సాహితీ సమాఖ్య ద్వారా కవనకిరణాలు లాంటి పుస్తకాలు మరిన్ని రావాలని కోరుకుంటున్నానని అన్నారు.

తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డా. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ...కవిత్వం ఒక ప్రవహించే నదిలాంటిదని , నేను కూడా కాసేపు ఇందులో మునకలేయవచ్చని, పైగా ముంబై కవులు వచ్చారని తెలిసి ఇక్కడికి వచ్చానని అన్నారు.

ఎంత పెద్ద చెట్టయినా దానికి పూవు పూసినప్పుడే అందం. ఏ కవికైనా ఒక మంచి కవిత వచ్చినప్పుడే పరిమళం. ఏ కవి అయినా ఒక చెట్టులాగా ఒక పువ్వు పూయగలగాలి. కవిత్వం మనల్ని పరిపాలిస్తుంది. ఏ పాలకుడూ మనల్ని పరిపాలించడు. మనోరాజ్యాన్ని పరిపాలించేది కవిత్వం మాత్రమే. అలాంటి కవిత్వమై మీరంతా పరిమలించాలని అన్నారు.

ఈ కవితా సంకలనంలో మౌనశ్రీ మల్లిక్, సాహిత్య ప్రకాశ్ కవితలతో పాటు చింతకింది శంకర్, యు.కె. మేఘ, జి.జి.రావు, దేవనపల్లి ఓగన్న, జక్కని గంగాధర్, వెంకటేశ్వర్లు, సూర్యప్రకాశ్, దోమల జనార్ధన్, ఈరబత్తిని రవి, కె.సుధీర్, రాఫా ఆడమ్స్, నరసింహాగౌడ్, జయపాల్‌రెడ్డి, మధుసూదన్ , శ్రీకాంత్, సుకన్యవేదం, విజయకుమారి, రేణుక బుధారం, డా॥ప్రియనితిన్ కవితలు వున్నాయి. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరినీ అతిథులు సత్కరించారు. తెలుగు సాహితీ సమాఖ్య సంస్థ బాధ్యులు, కవి మంచాలను అతిథులు ఘనంగా సత్కరించారు. చింతకింది శంకర్ ప్రార్థనా గీతం ఆలపించగా మొదట జక్కని గంగాధర్ స్వాగతం పలికారు. చివర శ్రీమతి రేణుక బుధారం వందన సమర్పణ చేశారు.



జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న బైస వీణాదాస్, సుకన్య వేదం, రేణుక బుధారం.



'కవన కిరణాలు'లోని కవులతో అతిథులు.

## నిజాలు!

ఆన్ లైన్ గాడ్జెట్లపై మోజు-
ఎన్నో సార్లు మోసపోవడం రివాజు.
నరమాంస భక్షకులు నాడు-
నరరూప రాక్షసులు నేడూ నరబలుల్తో.
విజ్ఞానం నింగికెగసింది-
అజ్ఞానం మాత్రం ఇంకా అగాథంలోనే.
రెప్పలపై తైతక్కలు-
కలలొచ్చే క్రమంలో నిద్రా విపక్షమే.
బతుకు లాగించడం-
అదీ జీవించడమే, నిర్జీవంగా.
కాలం మరలి వస్తుంది-
మనం స్మృతులు కలబోసుకున్నప్పుడల్లా.
క్రమశిక్షణ అవసరమే-
కడుపు మాడ్చేంత శిక్షగా కానంత వరకు.
నిర్దాక్షిణ్యంగా నలిపెస్తేనేం..
పూవాసన మాత్రం వదలదుగా.
కొత్త కవిత వెల్లువెత్తనీ....
భావంలో శైలిలో శిల్పంలో పద సంపదలో.
కులమతాలు గుర్తేరావు-
ఆపద అవసరాల్లో, ఎన్నికల్లో మినహా.
టూగుటుయ్యాల ఏదీ ఇయ్యాల-
మనసులోనే తీపిగురుతులు మొయ్యాల.
మాంసం తినేవాళ్ళూ ఒప్పరు-
బొక్కలు మెళ్ళో వేసుకొని ఊరేగడాన్ని.
ఆకలికి వైకల్యం లేదు-
ఎలా చచ్చినా,చచ్చినట్టు పొట్ట నింపాల్సిందే.
నిశ్శబ్ద యుద్ధం-
నివురు గప్పిన నిశీథుల్లో.
బాల్యం బ్రతికొస్తుంది-
ఆల్బం తిరగేసినప్పుడల్లా, మోవిపై నవ్వై.
సంగీతం మత్తుమందే-
ధ్వని తరంగం ఇంద్రజాలంగా, మైకంలో తోస్తూ.



-డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## నాన్న...!

నువ్వే నా ముఖంపై చిరునవ్వు
నువ్వే నా బాధలకు ఓదార్పు
నువ్వే నా సంతోషం
నువ్వే నా అదృష్టం

అందరి చీకటి లోకాలకు
వెలుగును ప్రసాదించేది నాన్న
నా లోకంలో చీకటే లేదు
ఇదంతా నా ప్రియమైన తండ్రివైన నీ వల్లే

ఎన్ని దీపాలున్నా
నా కిరణానివి నువ్వే
ఎంత పెద్ద ప్రపంచం ఉన్నా
నా అందమైన ప్రపంచం నువ్వే

నా ప్రగతికి సోపానం నువ్వే
నా ఒంటరి ఊహల్లో
నా తుంటరి ఆలోచనల్లో
నేను నడిచే దారులలో
ఓర్పుకు మారుపేరు
మార్పుకు నిదర్శనం

అమ్మ ప్రేమను కళ్ళలో చూడగలం
కాని, నాన్న ప్రేమను కన్నీళ్ళతోనే తెలుసుకోగలం
నా ప్రాణాన్ని నీ ప్రేమలో దాచాను నాన్న...



- భీంపల్లి సాహితి
9వ తరగతి,
శ్రీ చైతన్య హై స్కూల్
హయత్‌నగర్, హైదరాబాద్

## నడుస్తూ ఉండు

పడడం అత్యంత సహజమైనపుడు
లేవడం కూడా సహజమే!
నడకలు నేర్వడమేగా జీవితం

దుఃఖం మరకలు అంటకుండా
నవ్వులు రువ్వినంతకాలం
చుట్టూ గాలి పరిమళభరితమే!

ఎంతకాలమని మోస్తావ్
గతకాలపు బారాన్ని
ఎక్కడోదాన్ని పాతెయ్
వర్తమానం
కళ్ళు తెరుచుకుంటుంది
భవిష్యత్తు నాట్యమాడుతుంది.

ఒడ్డును ముద్దాడాలంటే
ఎదురీతలో అలల దెబ్బలు తినాల్సిందే!
గాయాల పాఠాలు
సలుపుతున్నప్పుడు
గుండె ఉక్కుపిడికిలైతది.

ఉదయం రుచి చూడకముందే
పడమరను ఆహ్వానిస్తావేం
కాలం ఉచ్చుకు చిక్కనిదెవరు?
ఘనీభవించిన ధైర్యం ముందు
ఓటమి తోకముడవదా!

పోటు తగిలితే
రాటుదేలిపో

నిఖార్సుగా నిటారుగా నిలబడే
మజా ముందు
కాలం వేటు ఒక లెక్కా!

తుంపరలను చూసి భయపడతావా
కష్టాల అలను ఒక్క చరపు చరిచిచూడు
నీ మనోబలానికి ప్రణమిల్లుతుంది

ఊపిరిని చెరుగుతూ
పై తంతెకై ప్రయాణం జీవిత సత్యం
అలుపును దాచేసి
మైలురాళ్ళు లెక్కిస్తూ వెళ్ళు
గమ్యం నీ ఆలింగనానికై
చేతులు చాస్తుంది.



- డా. శారదాహన్మాండ్లు
9912275801

## ప్రణయం

ఎందుకో చేరట్లేదు
నాలో వేదన అటువైపు

గుండెని పిండేస్తున్న
విరహవేదన
చేరవేసే మాధ్యమానికి
దయ లేదేమో !

కళ్లల్లో తొణికే
భాష్పాల కట్టడి
తరంకాక ఒలుకుతుంటే
మానసిక బలహీనతనుకుంటుందేమో !

ఆమె కోసం
నిరీక్షిస్తుంటే
వేసారిన మనసు హెచ్చరిస్తున్నా

అలాగే అలా
ఎన్నాళ్ళైనా వేచివుండే స్థైర్యం కళ్లల్లో
కనురెప్పల మాటున భద్ర పరుచుకునే దాకా

ఎన్ని మార్లో ఛీ ఛీ అంటూ
ఛీత్కరించుకున్నా
అది బాహ్య ప్రవర్తనేననే అంతరంగం
అంతః సంఘర్షణలో రాలే
అశ్రువులను ఒడిసిపట్టుకుంటుంది

పితృస్వామ్యంలో ఎదిగి ఒదిగి
బలమైన కట్టుబాట్ల ఛేదనలోకి
ప్రవహించే ఝరికోసం

ఎన్నికాలాలైనా
ఎన్ని ఋతువులైనా పట్టొచ్చు గాక
అంతిమంగా నేను ఆమెలో అంతర్లీనం

భాష కందని బాసలెన్నో
కనిపెట్టే నాలుగుకళ్ళు రెండై
ఒకే మనసుగా భావాల పంట పండించే
ప్రణయం
ఇరు హృదయాల సంగమ వేదికపై
వేడుకగా వర్ధిల్లు



- గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## అభినవ బకాసురులు

అత్యాచారమైనా, అపచారమైనా
న్యాయవిరుద్ధమే.
అడ్డదారులు తొక్కేవారికే
అడ్డగోలు ప్రచారం.
కోట్లు కొల్లగొట్టేవారి గురించి
కొనుక్కొని చదవాల్సిన వార్త.
కూడు గూడు కరువైన వాడికి
వీధి భాగవతారుడి గతి.
అంతా జనాల ఖర్మ
మాధ్యమాల మాయ.
బకరాలు తెరమరుగున
బకాసురులు తెరపైన.
నిజం ఎప్పుడూ
నివురుగప్పిన నిప్పే.
కాలం గడిచిన కొలదీ
నిప్పు మాయం
బూడిద ఖాయం!



- ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

# పొడుపు పద్యాల "ముద్దు బాల శతకము-2" ఆవిష్కరణ





పుస్తకాన్ని సమీక్షించి ప్రసంగిస్తున్న డా॥ ఏనుగు నరసింహారెడ్డి. పుస్తకావిష్కరణలో చింతా రామకృష్ణారావు, బైస దేవదాసు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రచయిత డా॥ నలవోలు నరసింహారెడ్డి, ఆవిష్కర్త కూరెళ్ల విఠలాచార్య, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ పొద్దుటూరి ఎల్లారెడ్డి.

డా॥ నలవోలు నరసింహారెడ్డి రచించిన 'ముద్దుబాల శతకము-2 (పొడుపు పద్యాలు) పుస్తకాన్ని ప్రముఖ కవి కూరెళ్ల విఠలాచార్య ఆవిష్కరించారు. సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీపీఠం ఆద్వర్యంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రతి పద్యాన్ని ఆటవెలది ప్రక్రియలో రాయటం విశేషమన్నారు. ఈ వినూత్న ప్రక్రియలో 108 పద్యాలను పొందుపరచటం అభినందనీయమని రచయితను కొనియా డారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కవిత్వాన్ని ఏ రూపంలోకి మలిచినా హృదయాన్ని తాకాలని అలాంటి కవిత్వమే మనగలుగు తుందని అన్నారు. ఈ ముద్దుబాల శతకం లోని పద్యాలు ఎంతో ప్రయోజనాత్మకమైనవని రచయిత డా॥నలువోలు నరసింహారెడ్డిని అభినందించారు. సాహిత్యం సామాన్యునికి అర్థమయ్యే రీతిలో రాస్తేనే చైతన్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, ఈ పద్యాలు పాఠకున్ని ఆలోచింపజేస్తూ, మెదడకు పదును పెట్టేలా వున్నాయని బైస దేవదాసు ప్రశంసించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ఏనుగు నరసింహారెడ్డి పుస్తక సమీక్ష చేసి రచయితకు అభినందనలు తెలిపారు. సాహి తీవేత్త డా॥పొద్దుటూరి ఎల్లారెడ్డి, కవి చింతా రామకృష్ణారావు అతిథులుగా పాల్గొని రచయిత సాహితీ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరి స్తూ అభినందనలు తెలియజేశారు. మొదట రాధశ్రీ పాడిన పద్యాలు అందరిని ఆహ్లాదపరిచాయి.

## పట్టణాల్లో జోరుగా పట్టణ ప్రగతి కార్యక్రమాలు

### వాడల్లో విస్తృతంగా పర్యటిస్తున్న మంత్రులు,ఎమ్మెల్యేలు

### టార్గెట్ విధించడంతో చురుకుగా ముందుకు నడుస్తున్న కౌన్సిలర్లు

హైదరాబాద్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): పట్టణాల్లో ప్రజానాయకుల సందడి కొనసాగుతోంది. అర్బన్ ప్రాంతాలను పరిశుద్ధం చేసేందుకు రంగంలోకి దిగారు. గత మూడురోజులుగా సాగుతున్న కార్యక్రమంతో మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టణాల్లో ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పల్లెప్రగతికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఇచ్చిన స్ఫూర్తితో సీఎం కేసీఆర్ పట్టణాల సమగ్ర అభివృద్ధికోసం పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సోమవారం నుంచి మార్చి 4వ తేదీ వరకు పదిరోజుల పాటు పట్టణ ప్రణాళిక నిర్వహించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీంతో ఎక్కడిక్కడ ప్రగతి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. మనం మారుదావం..మన పట్టణాలను మారుద్దాం అన్న నినాదంతో సాగుతున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి పల్లెప్రగతిని విజయవంతం చేసి తమ గ్రామాలను సుందరంగా తీర్చిదిదుకున్నట్లే.. పట్టణ ప్రగతిలో కూడా వార్డుల ప్రజలు ముందుకు వచ్చి అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రాధాన్యత అంశాల వారీగా పనులను పూర్తి చేసి పట్టణాలను సుందరంగా మార్చాలన్నారు. ప్రతి వార్డు కౌన్సిలర్, ప్రత్యేకాధికారులు ప్రజల భాగస్వామ్యంతో వార్డుల్లో పారిశుధ్యం, పచ్చదనాన్ని పెంపొందించా లన్నారు. ప్రతి ఒక్కరూ తమ వీధిని తామే బాగుపరుచుకుంటామనే ఆలోచన వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందరూ బాధ్యతగా పనిచేసి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలిరోజు వార్డుల్లో కౌన్సిలర్లు, ప్రత్యేకాధికారులు పర్యటించి సమస్యలను గుర్తించారు. మున్సిపాలిటీల్లో ఈ పదిరోజుల పాటు ప్రతిరోజు వార్డుల్లో పర్యటిస్తామని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రజలందరూ పట్టణ ప్రగతిలో భాగస్వాములై ఆదర్శవార్డులుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటలకు వార్డుల్లోనే కౌన్సిలర్లు, వార్డు ప్రత్యేకాధికారులు పనిచేయాలని ఆయా జిల్లా కలెక్టర్లు ఆదేశించారు. ప్రజలు గుర్తించిన సమస్యలను సైతం పరిష్కరించకుండా, పనులు చేయకుండా నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి కెటిఆర్ ఇప్పటికే హెచ్చరించారు. మొక్కలు నాటి పెంచకున్నా పదవి ఊడుతుందని కూడా కౌన్సిలర్లను హెచ్చరించారు. పట్టణ ప్రగతి అనంతరం సీఎం కేసీఆర్, మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు ఆకస్మికంగా ప్రతి వార్డును సందర్శిస్తారు. పనులు సక్రమంగా జరుగని వార్డుల్లోని వార్డు ప్రత్యేకాధికారి, కౌన్సిలర్లపై చర్యలు తప్పవన్నారు. సుందరంగా ఉన్న వార్డుకు అవార్డులు సైతం అందజేస్తారని చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిశుభ్రంగా ఉండాలని, వాటికి విద్యుత్, కంపౌండ్ వాల్స్, టాయిలెట్స్, మంచినీటి సరఫరా ఏ విధంగా ఉన్నాయో సరిచూసుకోవాలని ఆయా అధికారులకు ఆదేశించారు. కౌన్సిలర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని, కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం వారిని తొలగించే హక్కును కలెక్టర్లకు ఇచ్చారని గుర్తు చేశారు. మొత్తంగా ఇప్పుడు పట్టణ ప్రగతి ఏ మేరకు సాధిస్తుం దన్నది పదిరోజుల తరవాత గుర్తించవచ్చు.

## గుంటూరులో 'ఈ కాలం కథలు' పుస్తకావిష్కరణ



గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆద్వర్యంలో ఆదివారం బ్రాడిపేటలోని కొరటాల మీటింగ్ హాల్‌లో ప్రముఖ రచయిత చలపాక ప్రకాశ్ ప్రచురించిన "' ఈ కాలం కథలు" పుస్తకావిష్కరణ సోమేపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగింది.

పలు సాహితీ ప్రక్రియల్లో సృజనాత్మక రచనలు చేసిన చలపాక కలం నుండి జాలువారిన చిన్ని కథలతో "ఈ కాలం కథలు" రూపంలో పుస్తకం రావడం సంతోష దాయకమని సోమేపల్లి వెంకట సుబ్బయ్య అన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న అ.ర.సం. అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ చిన్న కథలు ఎంతో కష్టమని, అలాంటిది చిన్ని కథలతో ఒక పుస్తకాన్ని ప్రచురించడం, ఆ కథలలో చక్కని సందేశం ఉండటం అభినందనీయమన్నారు. ఎన్.వి. సత్యనారాయణ పుస్తక సమీక్ష చేశారు.

అనంతరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషకు విశిష్ట సేవలందించిన సాహితీమూర్తులు డా॥యల్లప్రగడ మల్లికార్జునరావు, శ్రీమతి షేక్ కాశింబిగార్లను గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆత్మీయ పురస్కారాలతో, శాలువా, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు.

సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. సుభాని, ఉపాధ్యక్షులు డా॥వి. నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, బుర్రి కుమార్‌రాజు, ఎన్. పురుషోత్తమ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డా॥యం. లలితకుమారి, బషీరున్నీసా బేగం, టి. పద్మావతి, రావిరంగారావు, పి.వి. సూర్యారావు, వెంకటరెడ్డి, భపభూతిశర్మ, ఎస్. ప్రభాకర్ తదితర సాహితీ మిత్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.







## ప్రజావాణి వినతులకు తక్షణ పరిష్కారం

నిర్మల్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లోపే పరిష్కరించాలని కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. వచ్చిన ప్రతి దరఖాస్తును ఆయా శాఖల అధికారులు ఆన్‌లైన్‌లో పంపిస్తామని, వాటిని వారం రోజుల్లోపు పరిష్కరించాలని, పరిష్కారం కాని సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. ఇదిలావుంటే నిర్మల్ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీని కలిసి విన్నవించారు. ఆర్వోఎఫ్ఆర్ కింద సాగు చేసుకుంటున్న భూములను డిజిటల్ పాసుపుస్తకాలు అందించి రైతుపెట్టుబడి సాయం అందించేలా చూడాలని పలువురు రైతులు కోరారు.

## గాయని అమృతవల్లికి ఆత్మీయ సత్కారం



నవ్యసాహితీ సమితి ఆధ్వర్యంలో లలిత సంగీత గాయని, రచయిత్రి డాక్టర్ పద్మిని చిత్తరంజన్ జయంతి సభను గానసభలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు పద్మిని రచించిన లలిత గీతాలను మహాభాష్యం చిత్తరంజన్ శిష్య బృందం మధురంగా ఆలపించింది. లలిత సంగీత విద్వాంసుడు చిత్తరంజన్, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎస్.ఎస్. మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు జీవీ ప్రభాకర్, నవ్యసాహితి అధ్యక్షుడు వి. విజయకుమార్ అతిథులుగా పాల్గొన్నారు. సృజనాత్మకత, ప్రయోజకత్వంతో పద్మిని తన సాహితి సృజన చేశారని వక్తలు ప్రశంసించారు. గాయని అమృతవల్లిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

## డా॥ అద్దేపల్లి ప్రభాకర్‌రావుకు మాడభూషి రంగాచార్య స్మారక పురస్కారం



ప్రముఖ కథా రచయిత డా॥ అద్దేపల్లి ప్రభాకర్‌రావు (ప్రభు)ను ఘనంగా సత్కరించి 'మాడభూషి రంగాచార్య స్మారక పురస్కారం 2019' ప్రదానం చేశారు. రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి మాడభూషి రంగాచార్య స్మారక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖ కథా, నవలా రచయిత కాలువ మల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అద్దేపల్లి రచించిన 'సీమెన్ కథలు'కు 2019 సంవత్సరానికి పురస్కారం అందించారు. ఈ సందర్భంగా కాలువ మల్లయ్య మాట్లాడుతూ పర్యావరణ ఇతివృత్తంగా సహజమైన కథలు 'సీమెన్ కథలు'లో ఉన్నాయన్నారు. ఈసందర్భంగా 2019లో తెలుగు కథ ప్రస్థానం గురించి డా॥ నెల్లుట్ల రమాదేవి విపులంగా వివరించారు. ప్రముఖ కవి, రచయిత డా॥ నాళేశ్వరం శంకరం పుస్తకాన్ని పరిచయం చేస్తూ పర్యావరణ విధ్వంసాన్నే కాదు నేడు అభివృద్ధి పేరిట మనిషిలో జరుగుతున్న విధ్వంసం గురించి ఈ పుస్తకం ఆలోచింపజేస్తూ జీవితాల్ని ఎలా నిలబెట్టుకోవాలో రచయిత ప్రభు కథల ద్వారా చెప్పారన్నారు. సంస్థ కన్వీనర్ మాడభూషి లలితాదేవి, శీలావీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE MOTOR VEHICLE ACCIDENTS CLAIMS TRIBUNAL CUM I ADDL CHIEF JUDGE AT SECUNDERABAD**
**M.V.O.P. NO.357 OF 2019**

Between:
**Golla Laxmi & Others** .....Petitioners
**And**
**N. Satyanarayana & Another** ..... Respondents

To
1. N. Bala Krishna
S/o. N. Satyanarayana
Occ: Owner of crime vehicle
R/o. 10-4-C/990, Addagutta
East Maredpally,
Secunderabad.
2. Venkatraman.K
S/o. K.V. Krishnamurthy,
Age-44 years, Occ: Driver
R/o. 68/7,III, Balaji Apartment,
Gandhinagar, Ch 20, SSDS,
Chennai-600020.

Take notice that the peititoner has filed a petition against the respondents U/S 166 of M.V.Act. You are hereby required to appear before this Hon'ble court on **11th March 2020** at 10.30 A.M. in person or through an advocate duly instructed to answer all material questions relating to the above proceedings, in default the issue will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT)
**SUDARSHAN REDDY SUBBAGARI**
**J. RAMESH**
Advocates.
Counsel for petitioner
Plot # 58, Saptagiri Colony,
Neredment X Road
Secunderabad-94

**BEFORE THE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION CUM ASST COMMISSIONER OF LABOUR-IV AT HYDERABAD**
**W.C. NO.238 OF 2018**

Between:
**D. Narsamma** .....Petitioners
**And**
**Ravindar Reddy Ch & Another** .....Opposite parties

To
Ravindar Reddy Chamala
S/o. Narsimha Reddy
H.No. 1-3, Nagasanipally,
Mothukupally,
R.R.Dist-501 106

Take notice that the peititoner has filed a petition against the Opposite Parties U/SEC 10 R/W SEC 22 of EMPLOYEES COMPESNATION ACT 1923. You are hereby required to appear before this Hon'ble court on **2nd March 2020** at 3.00 P.M. in person or through an advocate duly instructed to answer all material questions relating to the above proceedings, in default the issue will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT)
**SUBBAGARI.**
**SUDARSHAN REDDY**
Advocates.
Counsel for petitioner
Plot # 58, Saptagiri Colony,
Neredment X Road
Secunderabad-94




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com